


# ప్రపంచానికే తలమానికంగా హైదరాబాద్ అభివృద్ధి

- అమెరికానే శాసించే స్థాయిలో మన ఐటీ నిపుణులు
- అభివృద్ధిని అడ్డుకునే దొంగల పని పట్టాలి
- ఆధునిక హంగులతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు
- తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



**శేరిలింగంపల్లి ప్రతినిధి-నవభూమి, ఆగస్టు 20:** హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ వేదికగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలో రూ.30 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అపర్ణ కన్స్ట్రక్షన్ సంస్థ నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల భవన నిర్మాణానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. తమ సొంత నిధులతో ఈ ప్రభుత్వ భవనాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చిన అపర్ణ కన్స్ట్రక్షన్స్ ఎండి ఉదయ్ రెడ్డిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 5-స్టార్ హోటల్ స్థాయిలో ఆధునిక హంగులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. తమకు నచ్చిన సమయంలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి స్లాట్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ఏడాదికి 19 వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతున్నాయని, వాటి ద్వారా ఏటా ప్రభుత్వానికి రూ.15 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నాలెడ్జ్ పార్క్, ఐటీ జోన్ ప్రాంతాల్లో ప్రపంచంలోని 500 ఫార్ఛ్యూన్ కంపెనీలలో 85 దిగ్గజ సాఫ్ట్ వేర్ సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి తెలిపారు. టిసిఎస్, ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, గూగుల్ లాంటి అనేక భారీ ఐటి సంస్థలు అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే చదువుకున్న యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు. లక్షలాది మంది ఐటి నిపుణులు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారని, అమెరికాలో ఉన్న మన ఐటీ నిపుణులు ఒక్కరోజు పని ఆపేస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థనే దెబ్బ తింటుందని సీఎం స్పష్టం చేశారు.

హైదరాబాద్ నగరాన్ని మన దేశంలోని ఇతర నగరాలతో కాకుండా ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. "తెలంగాణ రైజింగ్-2047" పేరుతో రాబోయే 10 ఏళ్లలో మన హైదరాబాద్ నగరం ప్రపంచ వేదికగా రూపుదిద్దుకుంటుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందాలంటే మూసీ ప్రక్షాళన చేసి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. గుజరాత్ రాష్ట్రంలో సబర్మతీ నది, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో గంగా నది, ఢిల్లీలో యమునా నదిని ప్రక్షాళన చేసుకుంటే మన హైదరాబాద్ నగరంలో ఉన్న మూసీ నదిని ఎందుకు ప్రక్షాళన చేసుకోకూడదని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన కొందరికి ఇష్టం లేదని, ఫ్యూచర్ సిటీ నిర్మాణం నచ్చడం లేదని పరోక్షంగా కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. అభివృద్ధికి అడ్డుపడుతున్న దొంగల సంగతి మీరే చూసుకోవాలంటూ ప్రజలను ఉద్దేశించి సీఎం పిలుపునిచ్చారు. గచ్చిబౌలి ప్రాంతంలో ఎకరం 100 కోట్లకు పైగా ఉందని, ఇక్కడ కోటీశ్వరులు మాత్రమే కొనుక్కోగలరని, సామాన్యుల కోసం నగరాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, ప్రసార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో ఉన్న 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు 11 ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఏడాదిలోగా ఈ కార్యాలయాలు ఈ నూతన భవనాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు దేశంలో ఎక్కడా లేని విధంగా ఏఐ టెక్నాలజీని ఉపయోగించి సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ శంకుస్థాపన సభకు సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ స్పెషల్ సెక్రెటరీ రాజీవుగాంధీ హనుమంతు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, వి.జగదీశ్వర్ గౌడ్, రాగం నాగేందర్ యాదవ్, హమీద్ పటేల్, దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, ఓబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.









# మాటల్లో కాదు చేతల్లో చూపిస్తున్నాం

- వివిధ నిర్మాణ దశల్లో 2 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు
- రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20: -** పేదలకు ఇళ్ల నిర్మించడంలో గత పదేళ్ల కాలంలో ఆనాటి పాలకులు మాటలకే పరి మితమైతే, గౌరవ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం చేతలతో చేసి చూపిస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 2 లక్షల ఇందిరమ్మ ఇండ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. హైదరాబాద్ లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నూతనంగా నిర్మించిన కాన్ఫరెన్స్ హాల్ ను, ఆధునీకరించిన కార్యాలయ ఛాంబర్లను బుధవారం నాడు మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పేదవాడి ఆలోచనలకు అనుగుణంగానే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు అవుతున్నదన్నారు. గతంలో హౌసింగ్ కార్పొరేషన్ ను దాదాపు మూసి వేసే స్థాయికి తీసుకెళ్లితే, ప్రజా ప్రభుత్వం దానికి పునర్జీవం కల్పిస్తున్నదని అన్నారు. అందుకనే ఆ కార్పొరేషన్ లో పనిచేసే సిబ్బందికి కూడా మంచి వసతులను కల్పిస్తూ ఇంకా పటిష్టం చేస్తామన్నారు. కార్పొరేషన్ సిబ్బంది ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసి లక్ష్యసాధనకు తోడ్పాటును అందించాలని కోరారు. గ్రామాల్లో అర్హులైన పేదలందరికీ విడతల వారీగా ఇళ్లు వస్తాయన్న భరోసా కల్పించగలిగామని, ఇది చేతల ప్రభుత్వమని, ఇప్పటికే గ్రామాల్లో కొనసాగుతున్న పనులే నిదర్శనమని అన్నారు. ప్రతికూల ఆర్థిక పరిస్థితులున్నప్పటికీ ప్రతి సోమవారం లబ్ధిదారులకు చెల్లింపులు జరిగేలా చూస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇదే విధానాన్ని కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి గౌతం ప్రసంగిస్తూ కార్పొరేషన్ ను పూర్తి స్థాయిలో పునరుద్ధరించే చర్యల్లో భాగంగా, జిల్లాల్లో ఎఇల నియామకంతో పాటు, అవసరమైన మేరకు ఇతర విభాగాల అధికారుల సేవలను వినియోగించు కుంటున్నామన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని మంత్రి అభినందించారు

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం తోపాటు హౌసింగ్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి దారుణం

- కుటుంబ కలహాలతో ఇద్దరు చిన్నారులతో తల్లి ఆత్మహత్యాయత్నం
- ఇద్దరు చిన్నారుల మృతి

# ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి

**విజయపురి, న్యూ విజయపురి కాలనీలో రూ.కోటిన్నరతో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు**

**పనులను పరిశీలించిన కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్ -నవభూమి:** ఉప్పల్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్టుగా కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్ విజయపురి కాలనీ,న్యూ విజయపురి కాలనీలో రూ.కోటి 50 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. డివిజన్ లోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మాణాలను చేస్తున్నట్టుగా ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి చెప్పారు. ఉప్పల్ డివిజన్ ను సమస్యలు లేని డివిజన్ గా, ఆదర్శ డివిజన్ గా తీర్చి దిద్దుతున్నట్టుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ వెన్నల గౌడ్, రాములు,శ్రీపతి నరేందర్ రెడ్డి, మాధవరెడ్డి, నరసింహారెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, మస్తాన్ రెడ్డి,మధు, జంగారెడ్డి, లక్ష్మణ్, రాజేందర్, తుమ్మల దేవి రెడ్డి,భీమ్ సేన్, మోహన్ నాయక్,సల్ల ప్రభాకర్ రెడ్డి,ఈగ అంజయ్య, సుదర్శన్,బొడిగ మల్లేష్, ఉమారాణి, రాణి, శివయ్య, గర్దాస్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీకాంత్ రెడ్డి భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు



**ఉప్పల్ -నవభూమి:** రామంతాపూర్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా జరిగినశోభాయాత్రలో విద్యుత్ ప్రమాద ఘటనలో చనిపోయిన రామంతపూర్ శారద నగర్ శ్రీకాంత్ రెడ్డి బుధవారం అంతిమయాత్ర సందర్భంగా భౌతిక గాయానికి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను ఉప్పల్ కాంగ్రెస్ నేతలు పరామర్శించి సానుభూతి తెలిపారు.శ్రీకాంత్ రెడ్డి భౌతిక గాయానికి నివాళులర్పించి వారి ఆత్మకు చేకూరాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్టేట్ యూత్ మాజీ జనరల్ సెక్రెటరీ గడ్డం రవికుమార్, రామంతాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తవిడిపోయిన గిరిబాబు, సుర్వి మురళి గౌడ్ ఉప్పల్ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సుర్వి మురళి గౌడ్, నాయకులు పబోజు బిక్షపతి చారి తదితరులు పాల్గొని శ్రీకాంత్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు

# ఎస్టీ సబ్ ప్లాన్‌కు రూ.700 కోట్ల ప్రతిపాదనలు సర్కార్‌కు ఇచ్చాం

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 :** రాష్ట్రంలో అన్ని గిరిజన తాండాలు, గుడాలు లో రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాలు అభివృద్ధికై రాష్ట్ర గిరిజన శాఖ ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా 700 కోట్ల రూపాయాలను ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేయడం జరిగిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం నాడు సచివాలయంలో విలేఖరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, గిరిజన తాండాలను, గుడాలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేసెందుకు ఎస్టీ సబ్ ప్లాన్ అమలు చేస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ శాఖల అభివృద్ధికై కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి రాబట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే తాను కేంద్ర గిరిజన శాఖ మంత్రి ఢిల్లీలో పలుమార్లు కలసి ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను విడుదల చేయాలని కోరడమైనదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని ఎస్సీ ,ఎస్టీగురుకుల పాఠశాలలో నాణ్యమైన బోజన సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో హాస్టల్ లలో అల్యూమినియం వంట పాత్రలు వాడకం వలన పలు సమస్యలు వచ్చేవని, వీటి స్థానంలో స్టెయిన్లెస్ స్టీల్ పాత్రలు సరఫరా చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా జిల్లా, మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి బోజన నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో




రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి

ఎమ్మార్వో,ఎంపీడీవో, డిఎంహెచ్ఓఇతర శాఖల అధికారులతో తప్పనిసరిగా వసతి గృహాలను సందర్శించి ఎక్కడా సమస్య రాకుండా చూసెందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వసతి గృహాలలో కామన్ డైట్ ను అమలు చేస్తున్నట్లు, అందుకు అవసరమైన కూరగాయలు, గుడ్లు, చికెన్ ఇతర వస్తువుల కోనుగోలు జిల్లా స్థాయిలో టెండర్ల ద్వారా పారదర్శకంగా కోనుగోలు చేసెందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు అందేచేస్తున్న నెలకు రూ.300 పించన్ ను 3000 రూపాయాలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందని మంత్రి వెల్లడించారు. ఈ విలేఖరుల సమావేశంలో సాంఘిక సంక్షేమ, గురుకుల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిని పాల్గొన్నారు.

# బతుకమ్మ పండుగను రాష్ట్రంలో ఘనంగా నిర్వహించేందుకు పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు





**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 :** బతుకమ్మ పండుగను రాష్ట్రంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పర్యాటక శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టనున్నదని రాష్ట్ర టూరిజం అండ్ కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ అన్నారు రాబోయే బతుకమ్మ పండుగ-2025 నిర్వహణ ఏర్పాట్లపై పర్యాటక , సాంస్కృతిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ ఆధ్వర్యంలో బుధవారం బేగంపేట్ హరిత ప్లాజా హెూటల్ లో వివిధ శాఖల ఉన్నతాధికారుల అభిప్రాయాలు సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ అని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా బతుకమ్మ పండుగ నిర్వహణ ఘనంగా చేపట్టేందుకు అన్ని శాఖల అభిప్రాయాలు సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందని అలాగే హైదరాబాద్ మహానగరం తో పాటు, వరంగల్ మరికొన్ని జిల్లాల్లో బతుకమ్మ పండుగ సంబురాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ కళారూపాలు బతుకమ్మ పండుగలో కీలక పాత్ర పోషించటం జరుగుతుందని దేశ అంతర్జాతీయ స్థాయిలో బతుకమ్మ పండుగ ఖ్యాతిని పెంచే దిశగా ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ వాల్ పోస్టర్లు, పండుగ యొక్క సాంప్రదాయం, వేడుకల నిర్వహణ విధి విధానాలు, స్వయం సహాయక సంఘాల పాత్ర, కులవృత్తుల వారు తయారుచేసిన వస్తువుల విక్రయాలు, కళా ప్రదర్శనలు తదితర అంశాలపై శాఖల వారీగా అభిప్రాయాలను స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ నిర్వహణకు గతం కంటే ఎక్కువ నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ గుర్తింపని, అన్ని శాఖలు సమన్వయంతో కలసి పనిచేసి ఈ బతుకమ్మ వేడుకలను మరింత ప్రతిష్టాత్మకంగా, సమగ్రంగా, ప్రభావవంతంగా నిర్వహించే దిశగా ఏర్పాట్లు ఉంటాయని ఆయన తెలిపారు. సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనిబాలా దేవి, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, టూరిజం కార్పొరేషన్ ఎండి క్రాంతి వల్లూరి, అదనపు సీపీ (ట్రాఫిక్) జోయెల్ డేవిస్, సంస్కృతి శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రత్యేక అధికారి కిషన్ రావుతో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పోలీస్ వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.

# సీనియర్ సిటిజన్స్ భవన విస్తరణకు ఎంపీ ఈటల నిధులు

**■ వడ్డేపల్లి రాజేశ్వరరావును కలసి కమిటీ సభ్యులు, కాలనీ వాసులు హర్షం**

**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20 :** కెపిహెచ్బీ మూడో ఫేజ్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ భవనం విస్తరణకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఎంపీ నిధుల నుంచి నిధులు మంజూరు చేశారు. ఈ నిర్ణయంతో కమిటీ సభ్యులు, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఈ రోజు ఉదయం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ ఈటెల రాజేందర్‌కు తమ కృతజ్ఞతలు తెలియజేయాలని ఆయనను కోరారు. సీనియర్ సిటిజన్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని భవనం విస్తరణకు నిధులు మంజూరు చేయడం సమాజానికి మేలుకలిగించే



నిర్ణయమని, దీని ద్వారా వృద్ధులకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నేతలు



**ఉప్పల్ -నవభూమి:** భారత దేశం ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ  జయంతి సందర్భంగా రామంతపూర్ మెయిన్ రోడ్ లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించిన  కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి, రామంతపూర్ కాంగ్రెస్ పార్టీ  ఇన్చార్జ్ తవిడ బోయిన గిరిబాబు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రవికుమార్,సర్వీ మురళి గౌడ్ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సుర్వి మురళి గౌడ్ , విశ్వకర్మ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బిక్షపతి చారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.

## రాహుల్ గాంధీకి లేఖలు పోస్ట్ కార్డ్ల ఉద్యమం



**ఆల్వాల్, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20:** తెలంగాణ ఉద్యమ కారుల కి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ గారికి లేఖలు పోస్ట్ కార్డ్ ఉద్యమం ను ఈ రోజు అల్వాల్ లోని పోస్ట్ ఆఫీసు లో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డ్ లను పోస్ట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో టి యూ ఎఫ్  చైర్మన్  చీమ శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి పి.సురేందర్ రెడ్డి కన్వీనర్ గుండేటి ఐలయ్య యాదవ్ గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ జి దయానంద్ కన్వీనర్ బి.జగన్ యాదవ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జానకి రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్ కన్వీనర్ రాజేందర్ నియోజక వర్గం కన్వీనర్ పుట్నాల కృష్ణ వి.అనిల్రాజ్ శివ కుమార్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారుల కి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాహుల్ గాంధీ కి లేఖలు కార్యక్రమం ను ఈ నెల 20 నుండి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని లక్షలాది లేఖలు పంపించనున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  వెంటనే హామీలను అమలు చేయాలని కోరారు.

## మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు రూ.150 కోట్లు మంజూరు

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 :** చేసిన తెలంగాణ ప్రభుత్వం 150 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన గిరిజన సంక్షేమ శాఖ వచ్చే ఏడాది జనవరిలో జరిగే మేడారం మహా జాతర నిర్వహణ, మేడారం లో శాశ్వత నిర్మాణాల పనుల కోసం 150 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా మేడారం మహా జాతర ను ఘనంగా నిర్వహించేందుకు 150 కోట్లు మంజూరు చేసిన సీఎం, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపిన పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి  సీతక్క

# అంతరాష్ట్ర గ్యాంగ్ రేప్ కేసు నిందితుడి అరెస్ట్

- 11 ఏళ్ల తర్వాత పోలీసులకు చిక్కిన నిందితుడు
- పది నిమిషాల్లోనే పట్టుకున్న మంచాల సీఐ మధు

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 20 (నవభూమి ప్రతినిధి):** గ్యాంగ్ రేప్ కేసులో పెరోల్ పై బయటికి వచ్చి 11 ఏళ్లుగా పోలీసుల కన్నుగప్పి తిరుగుతున్న నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు చిక్కడు. గత 2006 లో గుజరాత్ రాష్ట్రంలో బచ్చావ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గ్యాంగ్ రేప్ లో నిందితుడుగా ఉన్న సికిందర్ రహమతుల్లా 2014 వరకు జైలు శిక్ష అనుభవించాడు. 2014 లో పెరోల్ పై బయటికి వచ్చి పోలీసులకు దొరకకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. దాదాపు 11 సంవత్సరాల నుండి తప్పించుకొని తిరుగుతున్న నిందితుడి జాడ తెలుసుకొని గుజరాత్ పోలీసులు రంగారెడ్డి జిల్లా మంచాల మండలం పోలీస్ స్టేషన్ సిఐ మధుకు నిందితుడి గురించి వివరాలు తెలిపారు. సంబంధిత ఆధారాలతో సీఐ మధు తన సిబ్బందితో కలిసి కేవలం 10 నిమిషాలలో నిందితుడు ఆచూకీ తెలుసుకొని నిందితున్ని అదుపులోకి తీసుకొని



గుజరాత్ పోలీసులకు అప్పగించారు. దీంతో మంచాల మంచాల సీఐ మధు పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు సికిందర్ రహమతుల్లా మంచాల మండలం లింగంపల్లి గేటు వద్ద ఉన్న గుడ్ల కోళ్ల ఫారం సమీపంలో గత కొన్ని రోజులుగా పనులు చేస్తున్నాడు. గుజరాత్ పోలీసులు ఇచ్చిన ఆధారులతో స్థలాన్ని గమనించి నిందితున్ని తొందరగా పట్టుకోవడం జరిగిందని చెప్పారు. గుజరాత్ పోలీసులు మాట్లాడుతూ సుమారు 11 సంవత్సరాల నుండి దొరకని నిందితుడిని 10 నిమిషాలలో పట్టుకోవడం ఆశ్చర్యాన్ని గురి చేసిందని మంచాల పోలీస్ సిబ్బంది పనిని ప్రత్యేకంగా సీఐ మధు ను అభినందించారు.

# ఐటీ రంగ సంస్కరణలకు ఆద్యుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ

- టిపిసి ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్



**కూకట్ పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20 :** ఐటీ రంగంలో సంస్కరణలకు ఆద్యుడు దివంగత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ అని టిపిసి ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా బుధవారం బాలానగర్ మూసాపేట్, కెపిహెచ్బీ కాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ ఐటీ



రంగంతో పాటు పాలనలోను సాధారణ ప్రజల అభివృద్ధి లక్ష్యంగా విస్తృతమైన సంస్కరణలు చేపట్టిన గొప్ప నాయకుడు. నేటి యువత ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, బ్లాక్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, మహిళా డివిజన్ అధ్యక్షురాలు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ, మైనారిటీ విభాగం, ఎస్సీ సెల్, బీసీ సెల్, సేవ్ దళ్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# టిజి ఇయాసోవాతో గవర్నర్ ఆత్మీయ సమ్మేళనం

## సామాజిక సేవా రంగంలో టిజి ఇయాసోవా పాత్ర ప్రశంసనీయం:గవర్నర్





**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 :** 2025 ఆగస్టు 20, బుధవారం, తెలంగాణ ఐఏఎస్ అధికారుల వైఫ్స్ అసోసియేషన్ (టిజి ఇయాసోవా) తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మను హైదరాబాద్‌లోని రాజ్ భవన్ వద్ద పిలుపునిచ్చారు.  గౌరవ గవర్నర్, ప్రథమ మహిళ, శ్రీమతి. సుధ దేవ్ వర్మ, అసోసియేషన్ సభ్యులతో హృదయపూర్వకంగా సంభాషించారు. .సామాజిక సేవా రంగంలో వారి ప్రశంసనీయ కార్యక్రమాలను అభినందిస్తూ, గవర్నర్ సమాజ సంక్షేమానికి అసోసియేషన్ నిబద్ధతను ప్రశంసించారు సభ్యులను వారి ఆదర్శప్రాయమైన పని ద్వారా ప్రేరణకు మూలంగా కొనసాగించాలని కోరారు. గవర్నర్ రాజ్ భవన్ వద్ద అసోసియేషన్ సభ్యులకు సాంప్రదాయ భోజనాన్ని నిర్వహించారు. ఈ సందర్భం అనధికారిక నేపథ్యంలో స్నేహపూర్వక మార్పిడి





కోసం అవకాశాన్ని కల్పించింది, రాజ్ భవన్  అసోసియేషన్ మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసింది. ప్రధాన కార్యదర్శి, శ్రీ కెరామకృష్ణ రావు, ఐఏఎస్ గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ, శ్రీ ఎం. దానకిషోర్, ఐఏఎస్ గవర్నర్ జాయింట్ సెక్రటరీ, శ్రీ జె. భవణి శంకర్ ఈ పరస్పర చర్యలో ఇతర సీనియర్ రాజ్ భవన్ అధికారులతో పాటు ఉన్నారు.

## లక్ష్మమ్మ ఎంక్లేవ్‌లో భూగర్భ డ్రైనేజీలు పనులు రూ.50 లక్షల వ్యయంతో ప్రారంభం, కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్





**అల్వాల్, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20 :** మచ్చ బొల్లారం డివిజన్లో నీ లక్ష్మమ్మ ఎంక్లేవ్ ఏ ఆర్ కే హెూమ్స్ ఎదురుగా మైనంపల్లి హనుమంతరావు సహకారంతో 50 లక్షల రూపాయల వ్యయంతో కూడిన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్. బుధవారం కాలనీల అభివృద్ధిలో భాగంగా డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా చేసిన పిమ్మట అంతర్గత రోడ్లకు పనులు పూర్తి చేస్తామని ఆయన తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి సురేందర్ రెడ్డి శ్రీశైలం యాదవ్ లడ్డు దిడ్ల స్వామి కాలనీవాసులు వంశీ వెంకట స్వామి గురువారెడ్డి మురళి సందీప్ రెడ్డి కరుణశ్రీ అనురాధ దేవి సంతోషిని తదితరులు పాల్గొన్నారు

## రాజీవ్ గాంధీకి ఘన నివాళి అర్పించిన కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నేతలు



**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20 :** మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా బాలానగర్ డివిజన్‌లో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. మధు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏ బ్లాక్ అధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు పి. నాగిరెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశాభివృద్ధికి, ఆధునిక సమాజ నిర్మాణానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలకు హాజరైన ఇల్లెందు నాయకులు

**ఇల్లెందు ఆగస్టు 20 నవభూమి ప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర 4వ మహసభలు గాజుల రామారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 20వ తేదీ నుంచి 22 వరకు జరగుతున్న సందర్భంగా 20వ తేదీన ఘనంగా మహసభలు ప్రారంభమైనాయి.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం

■ **జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన హైదరాబాద్ తాజ్ కృష్ణలో జరిగిన సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నియోజక వర్గ ఇన్ ఛార్జ్‌లు హాజరు**





**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 :** సమావేశంలో జిల్లా అబివృద్ధి అజెండాగా అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ కార్యక్రమాలు ఇందిరమ్మ ఇళ్లు రహదారులు సాగునీటి ప్రాజెక్టులు విద్య వైద్య రంగాల్లో జరుగుతున్న అబివృద్ధి కార్యక్రమాల పురోగతి పై చర్చించారు.సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రైజింగ్ తెలంగాణ లక్ష్యంగా సాగుతున్న పాలనలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యే లు పార్టీ నియోజక వర్గ ఇన్ ఛార్జ్ లు నిబద్ధత తో నిజాయితీ గా పని చేయాలని మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.సాగునీటి ప్రాజెక్టులు పై రైతు భరోసా రైతు రుణ మాఫీ పై బీ.ఆర్.ఎస్ బిజేపి నేతలు చేస్తున్న అసత్య ప్రచారం క్షేత్ర స్థాయిలో తిప్పి కొట్టాలని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం విషయంలో అలసత్వం లేకుండా చూడాలని కోరారు. సన్నబియ్యం పథకం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం రైతు భరోసా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా ప్రభుత్వం పై ప్రజానీకం విశ్వాసంగా ఉన్నారని మంత్రి తుమ్మల తెలిపారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్ట్ లు రహదారులు నిర్మాణం లో ఫోకస్ పెట్టాలని అన్ని వర్గాల వారికి పార్టీలకు అతీతంగా ప్రజా పాలనలో పారదర్శకంగా ఉండాలని మంత్రి తుమ్మల తెలిపారు.పత్తి వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతాంగం ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని అబివృద్ధి లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తనదైన ముద్ర వేయాలని మంత్రి తుమ్మల అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల తో పాటు పార్టీ బలోపేతం పై ప్రధాన దృష్టి పెట్టాలని ,గత ప్రభుత్వ అరాచక అవినీతి కోటలు బద్దలు కొట్టి కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ,గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం చేయాలని బిజేపి బీ ఆర్ ఎస్ రెండు పార్టీలు ఎలా తెలంగాణ అభివృద్ధికి అడ్డు పడుతున్నారనే విషయాలపై పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

# ఈ వారంలోనే యూరియా సరఫరా చేయాలి

■ **కేంద్ర రసాయనాలు ఎరువులు మంత్రిత్వ శాఖకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి**



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 :** టి బిజేపి చీఫ్ రామచంద్ర రావు వ్యాఖ్యలు అవగాహనరాహిత్యం. సవాళ్లు కాదు సమస్య పరిష్కారం చేయాలి.ఇతర రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు సరఫరా చూస్తే మీ వాదనలో డొల్లతనం తెలుస్తుంది. మంత్రి తుమ్మల .యూరియా కొరత పై ప్రతిపక్ష పార్టీ ల వ్యాఖ్యలు అర్థరహితం మంత్రి తుమ్మల తెలంగాణ రైతాంగం అవసరాల దృష్ట్యా ఈ వారంలోనే ప్రకటించిన 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్ర రసాయనాలు ఎరువులు మంత్రిత్వ శాఖకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతపై తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో చేసిన నిరసన ప్రదర్శనతో కేంద్ర ఎరువులు రసాయనాల మంత్రిత్వ శాఖకు పరిస్థితులు తెలిశాయని మంత్రి తుమ్మల తెలిపారు. ఎంపీల ఆందోళనతో తక్షణమే ఈ వారంలో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కోసం కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కు ఆదేశాలు జారీ చేశారన్నారు. కర్ణాటక నుంచి 10800 మెట్రిక్ టన్నుల యూరియా మొదటి షిప్ మెంట్ ప్రారంభం అయిందనీ, ఈ వారంలో మరో మూడు షిప్ మెంట్ ల ద్వారా యూరియా సరఫరా చేయాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కు డైరెక్టర్ ఆఫ్ ఫెర్టిలైజర్స్ ఆదేశాలు జారీ చేశారు.ఈ నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉన్నందున జాప్యం లేకుండా యూరియా సరఫరా చేయాలని మంత్రి తుమ్మల కోరారు. యూరియా కొరత పై పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేసి తెలంగాణ రైతాంగం యూరియా కష్టాలపై దేశానికి తెలిసేలా చేసిన ఎంపీలకు, మద్దతుగా నిలిచిన ప్రియాంక గాంధీ కి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల అభినందనలుతెలిపారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయ స్వార్థం కోసం చేసే కుట్రల పట్ల రైతాంగం ఆలోచన చేయాలనీ తుమ్మల రైతన్నలకు విజ్ఞప్తి చేశారు.తెలంగాణ కు కేటాయించిన యూరియా సకాలంలో సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష కారణంగానే రైతులకు ఇబ్బందులు తలెత్తాయని ,కొందరు బీ.ఆర్.ఎస్ నేతలు వారి అనుచరులతో యూరియా కేంద్రాల వద్ద చెప్పులు క్యూ లైన్ లో పెట్టి యూరియా కొరత పై రైతాంగం ఆందోళన చెందే విధంగా కుట్రలు చేస్తున్నారని మంత్రి తుమ్మల మండిపడ్డారు.ఈ ఖరీఫ్ సీజన్ కు తెలంగాణ రాష్ట్రానికి 9 లక్షల 80 వేల మెట్రిక్ టన్నుల యూరియా కేంద్రం కేటాయింపులు చేశారు. ఆగస్ట్ 31 నాటికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలి కానీ ఇప్పటి వరకు 5.42 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారు.కేటాయించిన యూరియా లో 2.88 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాలో కొరత వల్ల రైతాంగంలో ఆందోళన నెలకొంది.ఈ నెలలో యూరియా వినియోగం ఎక్కువ ఉన్నందున కేటాయించిన యూరియాకు అదనంగా 80 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు రసాయనాల మంత్రిత్వ శాఖ ను మంత్రి తుమ్మల కోరారు. ఈ వారంలోనే మిగతా మూడు షిప్ మెంట్ లు ద్వారా యూరియా సరఫరా సకాలంలో చేయాలని మంత్రి తుమ్మల కోరారు. రాజకీయాలకు అతీతంగా పార్టీలు రైతాంగం పక్షాన నిలబడాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.బఫర్ స్టాక్స్ పై ప్రతిపక్ష పార్టీ ల నేతల వ్యాఖ్యలు అర్థరహితమని మంత్రి తుమ్మల వివరణ ఇచ్చారు.మార్క్ ఫెడ్ ను నోడల్ ఏజెన్సీ గా నియమించి ఎరువులు ముందుగానే తెప్పించి మే నుంచి బఫర్ స్టాక్స్ నిలువ చేయాలని ప్రతిపాదన చేస్తే కేంద్రం ప్రభుత్వం జాప్యం చేస్తూ యూరియా కొరతకు కారకులయ్యారు .ప్రణాళిక తో పనిచేస్తున్నా కూడా బీ.ఆర్.ఎస్ నేతలు రాజకీయ విమర్శలు చేస్తున్నారని తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయ స్వార్థంతో చేస్తున్న యూరియా కొరత కృతిమ ఆందోళనలతో అన్నదాతలను ఆగం చేస్తున్నారని ,రైతాంగం పట్ల చిత్తశుద్ధి ఉంటే రసాయనాలు ఎరువులు తగ్గించి సేంద్రీయ వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలి ,కానీ రైతులను ఆందోళనకు గురిచేయడం సమంజసమేనా ,రైతాంగం ప్రతిపక్ష పార్టీల ఉచ్చులో పడకుండా ఆలోచన చేయాలనీ కోరారు. తెలంగాణ బిజేపి అధ్యక్షుడు రామచంద్ర రావు అవగాహన రాహిత్యంతో సమస్యను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారని,తెలంగాణ రైతాంగం పట్ల బిజేపి నేతలకు చిత్తశుద్ధి ఉంటే యూరియా సరఫరా లో కొరత లేకుండా చేయాలని తుమ్మల సూచన చేశారు.సవాళ్లు కాదు సమస్య పరిష్కారం చేయాలని మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణ రైతాంగం శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతాంగంకు ఎల్లపుడు ప్రభుత్వం అండగా ఉంటుందనీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# ఉద్యోగాలు పొందడమే లక్ష్యంగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చేవారిగా ఎదగాలి

■ జేఎన్టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్‌రెడ్డి



**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20:** కేవలం ఉద్యోగాలు పొందడమే లక్ష్యంగా కాకుండా, ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఇంజినీరింగ్ విద్యార్థులకు జేఎన్టీయూహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఆలీప్) ఆధ్వర్యంలో, ప్రపంచ బ్యాంకు నిధులతో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న 'రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్‌ఎంఈఎస్' కార్యక్రమంలో భాగంగా మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ పరిశ్రమల శాఖ, గ్రామీణాభివృద్ధి సంస్థలు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించాయి.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాల్లోని అనుబంధ కళాశాలల్లో ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా యువతలో వ్యవస్థాపక స్ఫూర్తిని నింపవచ్చన్నారు. ఈ సదస్సులో పాల్గొన్న 250 మంది విద్యార్థులకు 15 రోజులపాటు స్కిల్ డెవలప్‌మెంట్, ప్రభుత్వ ఆర్థిక సహాయ పథకాలపై అవగాహన కల్పించనున్నారు. అలాగే, 15 మంది విద్యార్థులు తమ అంకుర, వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 500 అంకుర స్టార్టప్ సంస్థలను ఏర్పాటు చేసి ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. విష్ణువర్ధన్ అధ్యక్షత వహించారు. జేఎన్టీయూహెచ్ రెక్టర్ డా. కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆలీప్ డైరెక్టర్ కన్నెగంటి రమాదేవి, చీఫ్ ఇన్నోవేషన్ అధికారి డా. జహురుల్లా, వైస్-ప్రిన్సిపల్ ఎం. ఉదయ్‌కుమార్, ఇంక్యుబేషన్ మేనేజర్ ఎ. నవీన్‌కృష్ణ, స్టార్టప్ ఫౌండర్ సాజిద్, సమన్వయకర్త వంశీ, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్ కావ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేతలు



**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20:** భారత రత్న, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 81వ జయంతిని కూకట్పల్లి నియోజకవర్గంలో ఘనంగా జరిపారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు (జీవీఆర్) మంగళవారం మూసాపేట్ డివిజన్‌లో, కేపీహెచ్‌బీ రాజీవ్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు

## శిఖర రసోయి రెస్టారెంట్‌ను ప్రారంభించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు

### కూకట్‌పల్లి ప్రజలకు అత్యుత్తమ భోజన సౌకర్యాలను అందించాలి



**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20 :** కూకట్ పల్లి, బాలకృష్ణ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'శిఖర రసోయి రెస్టారెంట్' ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెస్టారెంట్ యజమాని మహేశ్వర్‌రెడ్డి, ఆయన మిత్ర బృందం రాజేశ్వరరావుకు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఆధునిక సదుపాయాలతో ప్రారంభమైన ఈ రెస్టారెంట్ కూకట్ పల్లి ప్రజలకు అత్యుత్తమ భోజన సౌకర్యాలను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది యువతకు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తుందని పేర్కొన్నారు. రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి విచ్చేసినందుకు రాజేశ్వరరావుకు యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

## ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహానేత, మన మాజీ ప్రధానమంత్రి భారతరత్న రాజీవ్ గాంధీ



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 :** 81 వ జయంతి సందర్భంగా వారికి ఘననివాలులర్పించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య, రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్, నాయకులు సుధాకర్ తదితరులు



# తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 95 లక్షల కుటుంబాలకు బీమా సేవలు

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 :** జీవిత బీమా పన్ను మినహాయింపు ప్రజలకు చేరేలా విధానాన్ని రూపొందించాలనీ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి భట్టి విక్రమార్క 20-08-2025 న న్యూ ఢిల్లీలో జరిగిన మంత్రుల సమూహం సమావేశంలో పాల్గొన్నారు. జీవిత, ఆరోగ్య బీమా సేవలపై జీఎస్టీ తగ్గింపు లేదా మినహాయింపు అంశాన్ని పరిశీలించి సిఫార్సులు చేయడానికి జీఎస్టీ కౌన్సిల్ ఈ మంత్రుల సమూహాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో బీహార్, పశ్చిమ బెంగాల్, మేఘాలయ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, గోవా రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉన్నారు. ఈ సమావేశంలో వ్యక్తిగత జీవన బీమా పాలసీలు, వ్యక్తిగత ఆరోగ్య బీమా పాలసీలు వాటికి సంబంధించిన రీ-ఇన్సూరెన్స్ పై పన్ను మినహాయింపు ఇవ్వడంపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనకు స్వాగతం పలుకుతూ ఉప ముఖ్యమంత్రి, ఈ నిర్ణయం బీమా సాంద్రత వ్యాప్తి పెరగడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

అయితే, జీవిత బీమా ఆరోగ్య బీమా పాలసీలపై పన్ను మినహాయింపు ప్రయోజనం నిజంగా ప్రజలకు చేరేలా ఒక విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని, లేకపోతే ఇది బీమా కంపెనీల లాభాలను పెంచే పరిస్థితి తలెత్తుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నిజంగా ప్రయోజనం చేకూరినప్పుడే ఈ చర్య లక్ష్యాన్ని చేరుకుంటుందని, అయినప్పటికీ రాష్ట్రాలకు కొంత మేర ఆదాయం నష్టం వాటిల్లి, అది ఇతర సంక్షేమ పథకాలకు వినియోగించదగిన నిధులు తగ్గిపోతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే 95 లక్షల కుటుంబాలకు బీమా సేవలు అందజేస్తోందని ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సమావేశంలో తెలిపారు.

# దళిత నాయకుడు ఎన్ఎస్ రాజుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి: ప్రజా సంఘాలు దళిత సంఘాలు డిమాండ్








**కుత్బుల్లాపూర్ - ఆగస్టు 20:(నవభూమి ప్రతినిధి)** సూరారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జగ్జీవన్ రామ్ భవనంలో దళిత ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్ అధ్యక్షతన దళితుల ప్రజాసంఘాల ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐ ఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అఖిల భారత రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయఅధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ భూదాల అమర్ బాబు అఖిల భారత రాష్ట్రీయ దళిత సేన జాతీయ అధ్యక్షులు డాక్టర్ అవి జె జేమ్స్ అఖిలభారత రాష్ట్రీయ దళిత సేన జాతీయ ప్రధాన కార్యదర్శి వై బాలరాజు దళిత సంఘాల నాయకులు బుచ్చన్న సిద్ధన్న మాట్లాడుతూ దళితులపై దాడులు జరిగితే ఐక్యంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక కమిటీ మంగ రామచందర్ ప్రధాన కార్యదర్శి హనుమకొండ ప్రేమ్ కుమార్ నరసింహ కోశాధికారి జీజే రత్నం కాటన్ దేవయ్య బూర్గు రవి చైతన్య గట్టు అశోక్ మేకల బాలయ్య డేవిడ్ భూదాల భాస్కర్ మేకల సత్యనారాయణ వెంకటేష్ అంజి మైనార్టీ నాయకులు ఇస్మాయిల్ తదితరులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు భవనంలోనే సమావేశమై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మేడ్చల్ సిహెచ్ శంకర్ రెడ్డి సూరారం సిఐసుధీర్ కృష్ణ దాడి చేసిన వారిని అరెస్టు చేస్తానని హామీతోనిరసనరాలినివిరమించుకున్నారు భవనం వద్ద జరుగుతున్న గొడవలకు భవనం పక్కన ఉన్న ఆర్య వైన్స్ కారణమని భవనం వద్ద నుండి ఆర్య వైన్స్ తొలగించాలిదళితులు ఐక్యంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

## ప్రజలను విష జ్వరాలనుండి కాపాడాలని ప్రత్యేక ప్రార్థనలు






**అల్వాల్, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20:** రామాంజనేయ చారిటబుల్ ట్రస్ట్ ఓల్డ్ ఆల్వాల్ వారి సౌజన్యంతో లక్ష్యం మణిద్వీప వర్ణన పారాయణం చేశారు ట్రస్ట్ చైర్మన్ అలివేలు మంగ శ్రీమతి వాణి ఆధ్వర్యంలో సంకల్పించిన ఈ కార్యక్రమము పివిఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేశారు జంట నగరాల భక్త సమాజం ఆధ్యాత్మిక సంఘాలు పాల్గొన్నారు వర్షాల ప్రభావం వలన భక్తులకు ప్రజలను విష జ్వరాలు నుండి కాపాడాలని అష్టైశ్వర్యాలు భోగ సంపదలు అనుగ్రహం పొందాలని ఈ మణిద్వీప వర్ణన పారాయణం ఏర్పాటు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నుంచి నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల ప్రొవిజనల్ లిస్ట్ విడుదల

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు :** ప్రతి అభ్యర్థి వివరాలను, ఎగ్జామ్‌లో వచ్చిన మార్కులను, వెయిటేజీ ద్వారా పొందిన మార్కులను లిస్ట్‌లో పొందుపర్చింది. ప్రతి అభ్యర్థి తాము పొందిన మార్కులు, ఇతర అంశాలను సరి చూసుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 26 నుంచి సెప్టెంబర్2వ తేదీ లోపల తెలియజేయాలని సూచించింది. అభ్యంతరాల నమోదుకు ఈ నెల 26 నుంచి బోర్డు వెబ్‌సైట్‌లో సదుపాయం కల్పిస్తామని పేర్కొంది. 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి గతేడాది నవంబర్ 23వ తేదీన పరీక్షనిర్వహించగా 40,243 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు

## ప్లాస్టిక్‌ను నిషేధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**కుత్బుల్లాపూర్ - ఆగస్టు 20: (నవభూమి ప్రతినిధి)** దుండిగల్ మున్సిపల్ ఆఫీసు నందు 100 ప్రోగ్రాం లో భాగంగా మహిళ గ్రూపు సభ్యులకు సహాస్ ఎన్జీ వారు హై జానీక్ పై అవగాహన సదస్సు నిర్వహించినారు, రుతు క్రమం లో ఏ విధంగా జాగ్రత్తలు పాటించాలి, నాచురల్ డిస్పోజల్ శానిటరీ ప్యాడ్స్ వాడాలని వివరించినారు.అందరూ ప్లాస్టిక్ ను నిషేధించాలని ప్లాస్టిక్ వాడకుండా ఉండాలని సూచించారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర నాయక్ , మెప్మా పి డి విజయలక్ష్మి, అనిల్, మంజుల, సుహాస్ ఎన్ జిఒనుండి అనూష,మౌనిక, సారిక, మహిళ రిసోర్స్ పర్సన్స్, మహిళా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు





# సాంకేతిక నైపుణ్యంతోనే ఉన్నత ఉద్యోగ అవకాశాలు

- ఓరియంటేషన్ డేలో విద్యార్థులకు వక్తల సూచన
- గురునానక్ విద్యా సంస్థలలో ఘనంగా ఒరియెంటేషన్ డే





**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 20 (నవభూమి ప్రతినిధి):** సాంకేతిక నైపుణ్యంతోనే విద్యార్థులు ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందగలుగుతారని విద్యార్థులకు వక్తలు సూచించారు. గురు నానక్ విద్యాసంస్థలలో 2025%-%26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల కోసం ఒరియెంటేషన్ కార్యక్రమం నూతన విద్యార్థులు, వారి తల్లి తండ్రుల సమక్షంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించడంతోపాటు, సంస్థ యొక్క విలువలు, దృష్టికోణం, విద్యా సంస్కృతిని వారికి పరిచయం చేసింది. గురునానక్ విద్య సంస్థల వైస్ చైర్మన్, గురునానక్ యూనివర్సిటీ చాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ అధ్యక్షతన జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ప్రయాగ్ కన్స్యూమర్ కేర్ సంస్థలో చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ కృతివాసన్ ఎస్, నోబుల్ 'క్యూ' కంపెనీ జనరల్ మేనేజర్ సురేష్ పెరుగు, ఆర్సీఐ డీఆర్డిఓ



శాస్త్రవేత్త ఉన్ని కృష్ణన్ లు హాజరయ్యారు. వారి విస్తృత పరిశ్రమ అనుభవం ఆధారంగా వారు విద్యార్థులకు ప్రేరణాత్మకంగా ఉన్నత లక్ష్యాలు పెట్టుకోవాలని, నిరంతర విద్య, ఆవిష్కరణపై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థుల కోసం ఇంటరాక్టివ్ సెషన్లు, సాంస్కృతిక ప్రదర్శనలు, క్యాంపస్ టూర్ ఏర్పాటు చేస్తూ విద్యార్థులు తమ విద్యా ప్రస్థానాన్ని ఉత్సాహంగా ప్రారంభించేందుకు అనుకూల వాతావరణం కల్పించడానికి నిర్వాహకులు చేసిన కృషిని తల్లి తండ్రులు ప్రశంసించారు. గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, గురు నానక్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డా హెచ్ఎస్ సైనీ, డా ఎస్ శ్రీనాథ రెడ్డి, డైరెక్టర్ డా సంజీవ్ శ్రీవాస్తవ, డైరెక్టర్, జీఎన్ఐటి డా పి.ల పార్థసారధి, జాయింట్ డైరెక్టర్ డా కె వెంకట రావు, ప్రిన్సిపల్ డా రిషి సయాల్, అసోసియేట్ డైరెక్టర్డా ఎస్వీ రంగనాయకులు, డీన్ అసిస్టెంట్ డైరెక్టర్ డా. కేదార్నాథ్, డా. భాస్కర్, విజయలక్ష్మి, కోఆర్డినేటర్లు, వినయ్ చోప్రా, డైరెక్టర్ ప్లేస్‌మెంట్స్, హెడ్ కార్పొరేట్ రిలేషన్స్ కర్నల్ (రిటైర్డ్) జోయన్తా సర్కార్, జీఎం అడ్మిన్, ఇతర విభాగ అధిపతులు సిబ్బంది పాల్గొన్నారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు అన్యాయం

- జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- అభివృద్ధికి ఆటంకం కలిగించేందుకు సర్కార్ కుట్ర







**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 20 (నవభూమి ప్రతినిధి):** తాము నిర్మాణం ప్రారంభించిన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించడం అన్యాయం అని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను ప్రజలకు దూరం చేస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో కలెక్టర్ కార్యాలయాన్ని లక్డీకాపూల్ నుంచి కొంగరకలాన్ కు , ఆర్డీఓ కార్యాలయాన్ని గోషామహల్ నుండి ఇబ్రహీంపట్నంకు, ఆర్టీఏ కార్యాలయాన్ని హస్తినాపురం నుంచి మన్నెగూడకు తీసుకొచ్చి ప్రజలకు పాలన చేరువ చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు అద్భుతమైన భవనాలు నిర్మించామని చెప్పారు. తాము నిర్మాణం ప్రారంభించిన ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మాణ దశలోనే మూలనపడేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే తమాషా చూస్తున్నారని ఎద్దేవ చేశారు. కొహెడను కూడా కాదని మంఖాలకు తరలించే చర్యలను చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు కలిగే ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రభుత్వం ఆటలాడుతున్నదని ధ్వజమెత్తారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పూర్తయితే ఇబ్రహీంపట్నం పాత గ్రామానికి మహర్దశ వస్తుందని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమస్యను జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేసి వివరించినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ కి వివరించి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వివరించారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే ప్రభుత్వ కుట్రలను భగ్నం చేస్తామని హెచ్చరించారు.

# భవాని నగర్ సమస్యలను పరిష్కరించాలి: రావుల







**కుత్బుల్లాపూర్- ఆగస్టు 20:(నవభూమి ప్రతినిధి)** నియోజక వర్గం పరిధిలో గాజుల రామారం డివిజన్ లో భవాని నగర్ రావి నారాయణరెడ్డి నగర్ పరిధిలో పాదయాత్ర ఓపెన్ నాలాలు రోడ్లు డ్రైనేజీ మాన్హోల్స్ పొంగి పొర్లు తున్న సందర్భంగా పాదయాత్ర చేసి అధికారులకు సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి కోరారు. ఈ కార్యక్రమంలో రఘు, గోపాల్, బాబు శ్రీను, వెంకటరత్నం, అనిత, దుర్గ, కవిత, కుమారి ,సునీత, త్రివేణి, తదితర నాయకులు పాల్గొన్నారు

# సహశ్రీని హత్య కేసు దర్యాప్తు వేగవంతం: సీఐ కేవీ సుబ్బారావు

### ఎవరిపైనా నిర్ధారణ లేని ఆరోపణలు, రూమర్లు చేయవద్దు: మీడియాకు సూచన



కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20 : కూకట్ పల్లి పరిధిలో సంచలనం రేపిన పదేండ్ల సహశ్రీని హత్య కేసుపై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. కేసును చేధించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అనుమానితుల గాలింపును ప్రారంభించారు. ఇప్పటికే పలు కోణాల్లో విచారణ జరుపుతున్న పోలీసు అధికారులు ఆధారాల కోసం దాడులు, చుట్టుపక్కల నివాసాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హత్యా ఘటనపై సోషల్ మీడియాలో వదంతులు విస్తృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో, అధికారిక సమాచారం కోసం మాత్రమే ఎదురు చూడాలని కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ సీఐ కేవీ. సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. కేసు ఇంకా దర్యాప్తులోనే ఉందన్నారు. ఎవరిపైనా నిర్ధారణ లేని ఆరోపణలు, రూమర్లు చేయవద్దని సూచించారు. ఏదైనా పురోగతి ఉంటే అధికారికంగా మేమే తెలియజేస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా సహశ్రీని హత్య కేసు మరింత మిస్టరీ గా మారుతుండగా, అనుమానితుల గాలింపు పై ఆసక్తికర చర్చలు కొనసాగుతున్నాయి.

# ప్రతి కాలనీలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు





కుత్బుల్లాపూర్ - ఆగస్టు 20:(నవభూమి ప్రతినిధి) నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు, విద్యార్థులు వివిధ కాలనీల సభ్యులు, తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు. వర్షా కాలం దృష్ట్యా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు

# రావూజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

గార్ల, నవభూమి, ఆగస్టు 20: అణగారిన వర్గాల ప్రజలు, గిరిజన ప్రాంత సమస్యలపై అలుపెరుగని పోరాటాలు సాగిస్తూ పెత్తందార్లకు కంటి మీద కునుకు లేకుండా చేసి అమరత్వం పొందిన సిపిఎం నాయకుడు ఇస్లావత్ రావూజీ సేవలు మరువలేనివని సిపిఎం పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి అన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల వల్ల దెబ్బ తిన్న

# రోడ్ల వివరాలపై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆరా



హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 : కల్వర్టులు,బ్రిడ్జిలు,కోతకు గురైన రోడ్ల వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలి - మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాడైన రోడ్లు,వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశం ఆర్ అండ్ బి హెడ్ ఆఫీస్ లో కంట్రోల్ సెంటర్ కు వస్తున్న ఫిర్యాదులు, సమాచార వివరాలు అడిగిన మంత్రి స్టేట్ రోడ్స్ సి.ఈ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆర్ అండ్ బి డివిజన్ల నుండి వివరాలు సేకరణ రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల వల్ల దెబ్బ తిన్న రోడ్ల వివరాలపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆరా తీశారు. బుధవారం నాడు ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కాజ్ వే లు,కల్వర్టులు,బ్రిడ్జిలు,కోతకు గురైన రోడ్ల వివరాలు మంత్రి అధికారులను అడిగితెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు ఈ సీజన్ లో అధిక వర్షాల వల్ల పాడైన రోడ్లు,కల్వర్టుల వివరాలు ఆర్ అండ్ బి అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజా రవాణాకు ఇబ్బంది లేకుండా తెగిన రోడ్లు, కల్వర్టుల వద్ద తాత్కాలిక పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాడైన రోడ్లు,వంతెనలకు సంబంధించి శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఆర్ అండ్ బి హెడ్ ఆఫీస్ లో కంట్రోల్ సెంటర్ కు వస్తున్న ఫిర్యాదులు,సమాచార వివరాలపై మంత్రి ఆరా తీయగా.. స్టేట్ రోడ్స్ సి.ఈ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో షిఫ్టుకు నలుగురు చొప్పున 24 గంటలు మానిటరింగ్ చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి గత రివ్యూలో చెప్పిన ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆర్ అండ్ బి డివిజన్ల నుండి వివరాలు సేకరణ చేస్తున్నామని,24 గంటలు అలెర్ట్ గా ఉంటున్నామని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ మంత్రికి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవుపై వెళ్ళొద్దన్న ఆదేశాలు పాటిస్తూ..ప్రతి ఆర్ అండ్ బి అధికారి నిబద్ధతతో పనిచేశారని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. గత పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ప్రవాహాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు ఆర్ అండ్ బి పరిధిలో 739 చోట్ల సమస్యాత్మక రోడ్లు గుర్తించామని,అందులో 854 కి.మీ రోడ్డు దెబ్బతిందని, 25 చోట్ల రోడ్డు తెగిపోతే వెంటనే 5 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ చేశామని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఆర్ అండ్ బి) మంత్రికి వివరించారు. 310 చోట్లలో కాజ్ వే లు,కల్వర్టులు వరద ప్రవాహం ఉంటే అందులో 228 దారి మళ్లింపు చేసినట్లు పేర్కొన్నారు. రాకపోకలకు ఇబ్బంది ఉన్న 232 ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన 175చోట్ల క్లియర్ చేశామని,మిగతా చోట్ల వేగంగా క్లియర్ చేస్తున్నామని అన్నారు. మొత్తంగా 200 చోట్ల లో రోడ్లు, కాజ్ వే,మైనర్ బ్రిడ్జి లు, కల్వర్టులు తాత్కాలికంగా,శాశ్వతంగా పునరుద్ధరించాలని ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక పునరుద్ధరణకు 46 కోట్లు వరకు ఖర్చు అవుతుందని,శాశ్వత పునరుద్ధరణ కోసం 984 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు వివరించారు. రోడ్ల డ్యామేజీ, ప్రజల రాకపోకలకు సంబంధించి ఎలక్ట్రానిక్ మీడియా,పలు దినపత్రికల్లో వార్తలు చూశానని వాటి క్షేత్ర స్థాయి పరిస్థితి ఏంటని మంత్రి ఆరా తీశారు. వెంటనే ఆ ప్రాంతాల్లో రీ స్టోర్ చేసి ట్రాఫిక్ క్లియరెన్స్ ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్టేట్ ఎన్ హెచ్ రోడ్ల కు సంబంధించిన వివరాలు ఇంచార్జి ఈఎన్సీ జయ భారతి,ఆర్బోర్బి,ఆర్ యు బి ల వద్ద పరిస్థితిని సి.ఈ రాజేశ్వర్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటి వరకు ఆర్ అండ్ బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు, క్షేత్ర స్థాయిలో చూపిన పని తీరును అభినందించిన మంత్రి, అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని వారికి చెప్పారు.

# మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని చేస్తాం

### ■ పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్






కంటోన్మెంట్, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20: తెలంగాణ రాష్ట్రం లో త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో మూఢనమ్మకాల నిర్మూలన చట్టం చట్టం చేస్తామని పిసిసి అధ్యక్షుడు,యం ఎల్ సి బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. హేతువాది నరేంద్ర దబ్బోల్కర్ వర్ధంతి, జాతీయ సైంటిఫిక్ టెంపర్ డే పునస్కరించుకొని. మూఢనమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి అధ్వర్యంలో మూఢనమ్మకాలు నిర్మూలన చట్ట సాధన స పై చర్చా గోష్టి ని బుధవారంనాడు సుందరయ్య విజ్ఞాన కేంద్రం బలమ్మ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలంగాణ మూఢనమ్మకాల నిర్మూలన ముసాయిదా చట్టాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో మూఢనమ్మకాల నిర్మూలన చట్టం ఎంతో అవసరం వుందన్నారు. నిరక్షరాస్యులే కాకుండా ఉన్నత చదువులు చదివిన వారే మూఢనమ్మకాల భ్రమలో వున్నారన్నారు.ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాజ్యసభలో జాతీయ స్థాయి లో చట్టం చేయాలని డిమాండ్ చేసినందున అది మాకు ఆదేశం అయినందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి చట్టం చేస్తామని అన్ని పార్టీలు కూడ మద్దతు ఇస్తారని ఆశించారు.కాంగ్రెస్, కమ్యూనిస్టు లు కలిసి మతోన్మాదాన్ని అడ్డుకోవాల్సిన అవసరం వుందన్నారు.ఎన్నికల సమయంలో నే రాజకీయాలు అని తర్వాత అభివృద్ధి పై కలిసి పనిచేయాలన్నారు.విద్య,ఆరోగ్యం పై ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ మూఢనమ్మకాలు సమాజాన్ని పట్టిపీడిస్తుందన్నారు.సమాజంలో చైతన్యం పెరిగేకొద్దీ మూఢనమ్మకాలు పెరుగుతున్నాయన్నారు. బాణమతి,మంత్రాల పేరుతో ఎస్సీ ,బిసిలను సజీవ దహనం చేస్తున్నారన్నారు.తొమ్మిది రాష్ట్రాలలో మూఢనమ్మకాల నిర్మూలన చట్టాలు చేసినందున తెలంగాణ లో కూడ చట్టం చేయాలని ముఖ్యమంత్రి, డిప్యూటీ సియం లకు నివేదిక సమర్పిస్తామన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో సైంటిఫిక్ టెంపర్ ను మొదటి ప్రధాని నెహ్రూ పెంపొందించారన్నారు. కాంగ్రెస్ సోషలిస్టు దేశంగా మార్చేందుకు పని చెస్తుందన్నారు. బిఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్ మాట్లాడుతు ప్రభుత్వం చట్టం తీసుకరావాలని మా పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. ప్రజల విశ్వాసాన్ని గౌరవిస్తునే మూఢనమ్మకాలను వ్యతిరేకించాలన్నారు. సిపియం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు అబ్బాస్ మాట్లాడుతూ ఎఐ సాంకేతిక పరిజ్ఞానం తో మూఢ విశ్వాసాలను ప్రచారం చెస్తున్నారన్నారు.మూఢనమ్మకాల నిర్మూలన చట్టం కోసం పొరాడుతమన్నారు.ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమక్రసి రాష్ట్ర నాయకులు ఝాన్సీ, సిపిఐ యం ఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు సదానందం, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాస్,మూఢనమ్మకాల నిర్మూలన చట్ట సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ రమేష్ , మానవ వికాస సమితి కేంద్ర నాయకులు సాంబశివరావు,దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, కులనిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వహీద్,జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షురాలు స్వరాజ్య లక్ష్మీ, విజ్ఞానదర్శిని రాష్ట్ర అధ్యక్షుడు అదామ్ రాజ్,వివిధ సంఘాల నాయకులు గుత్తా జ్యోత్స్నా, స్కైలాబ్,అనసూయ, స్వరూప, అనురాధ,జ్యోతి,కృష్ణ చంద్ ,రవి తేజ,జాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి నిద్ర చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు





**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 21 :** అది దట్టమైన అడవి. సెన్సిటివ్ జోన్. సెల్ ఫోన్ సిగ్నల్ కూడా ఉండవు. ఎటు చూసినా అడవే. అలాంటి ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో నిద్ర చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహంలో మంత్రి జూపల్లి కృష్ణారావు నిద్ర చేశారు. అధికారులు వద్దని వారించినా ససేమిరా అన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకుని, సౌకర్యాల కల్పన కోసం అక్కడే బస చేశారు ఉమ్మడి జిల్లా చరిత్రలో మారుమూల ప్రాంతంలోని విద్యార్థుల వసతిగృహంలో ఓ మంత్రి రాత్రి బస చేయడం ఇదే మొదటిసారి.

# కిన్నెర బాలుర వసతి గృహాన్ని సందర్శించిన జేఎన్టీయూహెచ్ రెక్టర్, రిజిస్ట్రార్‌లు

**కూకట్‌పల్లి, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20 :** జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) రెక్టర్ డా. కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు, వసతి గృహ వార్డెన్ డా. బి. సత్యనారాయణ ఈ సాయంత్రం కిన్నెరా బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ వసతి గృహంలో ఇటీవల బీటెక్ మొదటి సంవత్సరం ప్రవేశం పొందిన 250 మంది విద్యార్థులు (ఆగస్టు 18న చేరినవారు) నివసిస్తున్నారు. అధికారులు వసతి గదులు, పౌష్టికాహార భోజనశాల, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి అవసరాలు, సూచనలు తెలుసుకున్నారు. రెక్టర్, రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులకు సురక్షితమైన, శుభ్రమైన, సౌకర్యవంతమైన వసతి వాతావరణాన్ని కల్పించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు





# దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 21 :** దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన ప్రాణాలర్పించారు పారదర్శక పరిపాలన అందించడానికి సాంకేతికతను జోడించాలని ఆనాడు రాజీవ్ గాంధీ ఆలోచన చేశారు 18 ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పించి దేశ భవిష్యత్ ను నిర్ణయించే అవకాశం కల్పించారు స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు కల్పించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ కంప్యూటర్ ను దేశానికి పరిచయం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ టెలికాం రంగంతో దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు.

రాజీవ్ స్ఫూర్తితో ఆనాడు హైదరాబాద్ లో హైటెక్ సిటీకి పునాది పడింది రాజీవ్ స్ఫూర్తితో తెలంగాణను ఆర్థికంగా,సామాజికంగా ముందుకు తీసుకెళతాం సంక్షేమం, అభివృద్ధితో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ లాంటి సామాజిక సమస్యలకు పరిష్కారం చూపాం రాజీవ్ గాంధీని దేశ యువత స్ఫూర్తిగా తీసుకోవాలి రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకుని 21 ఏళ్లు నిండిన వారు శాసన సభకు పోటీ చేసేలా చట్టాన్ని సవరించేందుకు కృషి చేస్తాం ఆ కలలన్నీ సాకారం కావాలంటే దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలి రాజీవ్ స్ఫూర్తితో రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే వరకు విశ్రమించబోం

# భారతదేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన తొలి గురువు మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ





**అల్వాల్, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20 :** భారతదేశానికి టెక్నాలజీని తీసుకొచ్చిన తొలి గురువు రాజీవ్ గాంధీ అని మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు చెప్పారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81 వ జన్మదినాన్ని పురస్కరించుకొని అల్వాల్ రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అల్వాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల నాయకుల మధ్యన రాజీవ్ గాంధీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించుకొని పార్టీ అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి కేక్ కట్ చేయగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అధ్యక్షుడికి కేక్ తినిపించాడు . రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు . ఆయన దేశానికి చేసిన సేవలు ఎన్నటికీ మర్చిపోలేవి అని ఆయన కొనియాడారు .భారతదేశ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన ప్రధాని రాజీవ్ గాంధీ కృషి చేశారని తెలిపారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న మచ్చ బొల్లారం కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తోట లక్ష్మీకాంత్ రెడ్డి, సూర్య కిరణ్ బొబ్బిలి సురేందర్ రెడ్డి సంతోష్ రెడ్డి, ఉదయ్ కుమార్ జాజుల నర్సింగరావు తదితర నాయకులు కార్యకర్తలు మహిళ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# పోలీస్ అకాడమీలో మొదటి తెలంగాణ మహిళా పోలీసు అధికారుల రాష్ట్ర స్థాయి సదస్సు

**హైదరాబాద్ నభూమి ప్రతినిధి ఆగస్టు 20:** పోలీస్ అకాడమీ లో తొలి మహిళా పోలీస్ అధికారుల మూడురోజుల సదస్సును తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా సంక్షేమం శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి డాక్టర్ అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై బుధవారం ఘనంగా ప్రారంభించారు. పోలీస్ అకాడమీ డైరెక్టర్ శ్రీమతి అభిలాష్ బిష్త్ ఐ పి ఎస్ మొదటి మహిళా పోలీస్ అధికారుల రాష్ట్ర స్థాయి సదస్సు లక్ష్యాలను, సదస్సులో చేర్చించే ముఖ్యాంశాలను వివరించారు. మూడురోజుల సదస్సులో కానిస్టేబుల్ నుండి డిజిపి స్థాయి అధికారులందరూ ఐదు గ్రూపులుగా చర్చించి ఒక నివేదికను ముఖ్యమంత్రికి అంద ుజేస్తారని తెలిపారు. ఈ సదస్సులో తెలంగాణ పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా సంక్షేమం శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి డాక్టర్ అనసూయ సీతక్క మాట్లాడుతూ మహిళల శ్రేయస్సు కోసం ప్రభుత్వము ఎల్లవేళలా సహకరిస్తుందని తెలిపారు. మహిళా అధికారులందరూ అంకితభావం, క్రమశిక్షణ మరియు గౌరవంతో పనిచేయాలని కోరారు. సదస్సులో పాల్గొన్న మహిళ అధికారులకు మీరంతా ధైర్యం, దృఢ నిశ్చయంతో పనిచేస్తూ పరిస్థితులకు అనుగుణంగా మార్పు కావాలని కోరారు. ఈ సదస్సులో సమస్యలపై చర్చించి మంచి సూచలను రూపొందించాలని కోరారు. మహిళా అధికారుల సంఖ్య పెరుగుతున్నందుకు గర్వపడుతున్నామని, మహిళా శిశు సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా పోలీస్ అధికారులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని, భవిష్యత్లో మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళా పోలీస్ అధికారుల శిక్షణ, భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెడతామని తెలిపారు. మహిళా పోలిసుల సమస్యల కోసం డిజిపి ప్రత్యకమైన ఒక సెల్ ఏర్పాటుచేస్తే బాగుంటుందని సూచించారు. మహిళా పోలిసుల కోసం తమిళనాడు ఇతర రాష్ట్రాలలో మహిళా అధికారులకు ప్రత్యకమైన సౌకర్యాలు కలిపించిన విధంగా వాటిని స్టడీ కోసం ఒక టీంని ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకా మహిళా అధికారుల ఆరోగ్యం కోసం మరియు మానసిక ఒత్తిడిని తగ్గించే విధంగా కౌన్సిలింగ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని కోరారు. ముఖ్యంగా మహిళా పోలీస్ అధికారులే పోలీస్ స్టేషన్లో బాధితులుగా మారవద్దని సూచించారు. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 90 పోలీస్ స్టేషన్లు, ఇతర యూనిఫామ్ డిపార్ట్మెంట్స్ అయిన జైళ్ల శాఖ, అటవీ శాఖల నుండి దాదాపు 400 మంది అధికారులు పాల్గొన్నారు. వీరికి ఈ మూడురోజులు అకాడెమీలోనే వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ సదస్సులో మంత్రి సీతక్కను అకాడమీ డైరెక్టర్ మరియు ఇతర సీనియర్ అధికారులు శాలువాతో సత్కరించి మెమొంటోను అందించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రమునుండి హాజరైన డిఐజి వినీత్ ను, స్వాతిలక్రా ఐపి ఎస్, అడిషనల్ డీజీ, బాలనాగదేవి ఐపి ఎస్, అడిషనల్ డీజీ, చారుసిన్హా ఐపిఎస్, అడిషనల్ డీజీలను మెమొంటోలతో అకాడమీ డైరెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారుల గురించి మరియు ముఖ్య అతిథి గురించి అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి జి. కవిత స్ఫూర్తి దాయకమైన పరిచయ కార్యక్రమం, డిప్యూటీ డైరెక్టర్ శ్రీ. వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర స్థాయి సదస్సులో రాష్ట్ర మంత్రి సీతక్కతో పాటుపోలీస్ అకాడమీ డైరెక్టర్ శ్రీమతి అభిలాష్ బిష్త్ ఐపిఎస్, శ్రీమతి స్వాతిలక్రా ఐ పి ఎస్, అడిషనల్ డీజీ, శ్రీమతి. బాలనాగదేవి ఐ పి ఎస్, అడిషనల్ డీజీ, శ్రీమతి. చారుసిన్హా ఐపిఎస్, అడిషనల్ డీజీ, శ్రీమతి రమా రాజేశ్వరి, ఐపిఎస్ డిఐజి, ఎస్పీ స్థాయి అధికారులు అకాడమీ ఇండోర్ మరియు ఔట్డోర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అల్వాల్లో శ్రీ లక్ష్మీ సుదర్శన మహా యజ్ఞం ప్రారంభం



అల్వాల్, నవభూమి ప్రతినిధి, ఆగస్టు 20: శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అల్వాల్లో శ్రీ లక్ష్మీ సుదర్శన మహా యజ్ఞం బుధవారం నుండి శుక్రవారం వరకు మూడు రోజులు శ్రీ స్వామివారి సన్నిధిలో భక్తుల అభీష్టం మేరకు శ్రీ లక్ష్మీ సుదర్శన యాగం నిర్వహించ ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ యజ్ఞం వలన ప్రజలను రోగాల బారి నుండి రక్షణ కోసం అలాగే ఆరోగ్యము సంపద మరియు శాంతి కోసం సకల సంపదలతో ఆరోగ్యాలతో ప్రజలను కాపాడాలని నిర్వహిస్తున్నట్లు తెలిపారు . భక్తులు సదవకాశాన్ని ఉపయోగించుకోవాలని మాయాగంలో పాల్గొని తీర్థప్రసాదాలు సేకరించి శ్రీవారి కృపకు పాత్రులు కావాలని కోరారు దేవస్థానం అభివృద్ధికి దాతలు విరాళాలు అందించి శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కాగలరని భక్తులను కోరారు ఈ కార్యక్రమంలో ఆచార్యులు విజయ సారథి రఘు పంతులు వంశీ పంతులు ఆలయ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైన్సర్ కార్యనిర్వాహణాధికారి మఠం వీరేశం సామాజిక సంఘ సేవకులు శివరామకృష్ణ సురేందర్ రెడ్డి రామచంద్రరావు ఆలయ సిబ్బంది వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# సుభాష్ చంద్రబోస్ నగర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: రావుల శేషగిరి



కుత్బుల్లాపూర్ - ఆగష్టు 20: (నవభూమి ప్రతినిధి) నియోజక వర్గం పరిధిలో గాజులరామారం డివిజన్ సుభాష్ చంద్రబోస్ నగర్ లో పాదయాత్ర చేసిన బిజెపి నాయకులు గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, రెహమాన్ ,విశ్వనాథ్, రాజు, నవీన్ ,సాగర ,శివాసాస్, నరసింహ చారి ,కృష్ణ గౌడ్, విష్ణు గౌడ్, నర్సింలు, స్వామి ఖాజా ,రాజు ,హనిఫా, ప్రభాకర్ , పార్వతీ, మనెమ్మ, సులోచన, శ్రీనివాస్, బాబీ బస్తీ వాసులు తదితర నాయకులు పాల్గొన్నారు

# తప్పుదోవ పట్టిస్తే కఠిన చర్యలు

## మంత్రి దామోదర్

హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20 - మెడిసిన్ విషయంలో తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఈ మేరకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ పనితీరుపై మంగళవారం, వెంగళరావు నగర్లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 %ద% 2025లో డీసీఏ వర్క్ ప్రోగ్రెస్‌ను మంత్రికి డీసీఏ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం వివరించారు. 2024లో 25,939 తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 4142 సంస్థలపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2025లో జనవరి నుంచి జూలై వరకు 16,481 తనిఖీలు చేశామని, నిబంధనలు ఉల్లంఘించిన 2827 సంస్థలపై చర్యలు తీసుకున్నామన్నారు. 2024 జనవరి నుంచి 2025 జూలై వరకు 7200 మెడిసిన్ సాంపిల్స్‌ను టెస్ట్ చేయగా, అందులో 186 నాసిరకం మెడిసిన్‌గా తేలిందని, సంబంధిత సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు. సుమారు 700 కేసులు బుక్ చేశామని వివరించారు. ప్రతి కేసులోనూ దోషులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జనాలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇస్తూ, మెడిసిన్ అమ్మకాలు జరుపుతున్న కంపెనీలు, వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. స్పూరియస్, నాట్ స్టాండర్డ్ డ్రగ్స్ తయారు చేస్తున్న ఫార్మా కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, అమ్మకందారులపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మెడిసిన్ అనేది ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం అని, ఈ విషయంలోలాంటి ఉపేక్ష పనికిరాదన్నారు. పదే పదే నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలను చట్టప్రకారం పర్మినెంట్‌గా క్లోజ్ చేయాలని ఆదేశించారు. నకిలీ, నిషేధిత మందుల తయారీ, అమ్మకం దారులపై అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడిసిన్‌ను ఆహార పదార్థాలుగా చూపిస్తూ, వాటి తయారీ, అమ్మకాలు చేపడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. యాంటిబయాటిక్ రెసిస్టెన్స్ అనేది పెద్ద ముప్పుగా పరిణమిస్తోందని, నిబంధనలు ఉల్లంఘించి యాంటిబయాటిక్స్ అమ్మకాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు ప్రేరేపిత మెడిసిన్ అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీసీఏ డీజీని మంత్రి ఆదేశించారు. డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ అప్‌గ్రేడేషన్ పనులను స్పీడప్ చేయాలని మంత్రి ఆదేశించారు. త్వరలో మరిన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను మంజూరు చేసి, రిక్రూట్ చేస్తామని.. తద్వారా డ్రగ్ కంట్రోల్ అథారిటీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ప్రజలకు క్వాలిటీ మెడిసిన్, క్వాలిటీ ఫుడ్ అందించే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు

# అంగన్వాడి చిన్నారులకు త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్

- అంగన్వాడి నూతన భవనాల నిర్మాణానికి ఉచిత ఇసుక
- వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్‌లో సదుపాయాలను మెరుగుపరుస్తాం
- మహిళా శిశు సంక్షేమ శాఖపై సమీక్షలో మంత్రి సీతక్క





హైదరాబాద్ నవభూమి ప్రతినిధిఆగస్టు 20: ఎర్ర మంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యకలాపాలపై మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, జాయింట్ డైరెక్టర్లు, రీజినల్ జాయింట్ డైరెక్టర్లు, అన్ని విభాగాల హెచ్ఓడీలు హాజరయ్యారు. సమావేశంలో నూతన అంగన్వాడి భవనాల నిర్మాణం, అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, సాక్షం అంగన్వాడి, ఆరోగ్యలక్ష్మి, మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి, చిన్నారులకు యూనిఫాం పంపిణీ, అంగన్వాడి టీచర్లు మరియు హెల్పర్లకు యూనిఫాం చీరల పంపిణీ, వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ బలోపేతం, చిన్నారులకు విజయ పాల సరఫరా, బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాం, పాలనా కేంద్రాలు, పోషణ్ అభియాన్ తదితర అంశాల్లో సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్వాడి భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల తరహాలోనే అంగన్వాడి కేంద్రాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంజూరైన 1025 అంగన్వాడి భవనాలలో ఇప్పటివరకు 625 ప్రాంతాల్లోనే స్థలాలు గుర్తించారని.. మిగిలిన ప్రాంతాల్లో స్థల గుర్తింపు తక్షణం పూర్తిచేయాలని సూచించారు. ఒక్కో భవనం నిర్మాణానికి రూ.12 లక్షలు కేటాయించినట్లు గుర్తుచేశారు. పనుల జాతరలో భాగంగా నూతన భవనాల శంకుస్థాపనలు జరగాలని, ఇప్పటికే పూర్తి చేసిన 22 అంగన్వాడి భవనాలను స్థానిక ఎమ్మెల్యేల చేత ప్రారంభించాలన్నారు. అంగన్వాడి టీచర్లు, హెల్పర్ల యూనిఫాం చీరల తయారీ పూర్తై జిల్లా కేంద్రాలకు చేరాయని, వాటిని తక్షణమే పంపిణీ ప్రారంభించాలని తెలిపారు. చిన్నారుల కోసం త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభిస్తున్నామని, ఇప్పటికే హైదరాబాద్‌లోని 139 అంగన్వాడి కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ స్కీమ్ కారణంగా పిల్లల హాజరు 30 శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ అనుభవంతో త్వరలోనే పలు జిల్లాల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను విస్తరించనున్నట్లు వెల్లడించారు. పిల్లల పోషకాహారాన్ని మెరుగుపరచడం కోసం ప్రతి చిన్నారికి ఉదయం 100 మి.లీ. పాలు అందించే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, ప్రతి వారం ఒక రోజు ఎగ్ బిర్యానీ, ఒక రోజు వెజిటేబుల్ కిచిడి వడ్డించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు కూర్చునేలా పంపిణీ చేస్తున్న లాంగ్ టేబుల్స్ ఎత్తు పెంచాలని లబ్ధిదారుల అభిప్రాయాల మేరకు మార్పులు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొమ్మిది వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ సేవలందిస్తున్నాయని, మరో ఐదు హాస్టల్స్ నిర్మాణంలో ఉన్నాయని మంత్రి సీతక్క తెలిపారు. వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్‌లో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మరిన్ని సదుపాయాలు కల్పించే దిశగా శాఖ కృషి చేయాలని ఆమె సూచించారు. అంగన్వాడి సేవలను అందించడంలో ఎక్కడా రాజీ పడొద్దు అని అధికారులను ఆదేశించారు. ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా పోషకాహారం అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క సిబ్బందిని అభినందించారు. అంగన్వాడీ కేంద్రాలను దేశానికి ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

# మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



మేడ్చల్- ఆగష్టు 20: (నవభూమి ప్రతినిధి)- మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల ప్రెసిడెంట్ రమణారెడ్డి, కౌన్సిలర్లు దేవరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేకు రాజు,వర్ద రెడ్డి ,సుదర్శన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, మురళి గౌడ్ ,రాజశేఖర్ రెడ్డి, కృష్ణ, నర్సింగ్ ,పత్తి ఆంజనేయులు, గణేష్, గోపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్, సాయి, మహేష్ సంతోష్, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్- ఆగష్టు 20:(నవభూమి ప్రతినిధి)** నియోజకవర్గం గాజుల రామారం డివిజన్ పరిధిలోని ఒక్షిత్ హిల్స్ వ్యూ కాలనీ రోడ్ లో పాదచారులకు ఇబ్బంది పడుతున్నామని గత నేల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించి విన్నపించగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు కొరకు రూ.55 లక్షల రూపాయలు మంజూరు చేయించి . ఈరోజు సీసీ రోడ్డు శంకుస్థాపన చేశారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి అనంతరం కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ శాల్వాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రావణ్ కుమార్ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, అమీర్, అఫ్జల్, నరేష్, సోమిరెడ్డి, నాయుడు, విజయ్, కుమార్, అరుణ, సురేందర్ మరియు భారీ సంఖ్యలో కాలిని వాసులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్- ఆగష్టు 20:)(నవభూమి ప్రతినిధి)** నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ యువత భవిష్యత్తే దేశ భవిష్యత్తు అని సాంకేతిక, విద్య, వైద్య రంగాలలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన మహనీయుడు రాజీవ్ గాంధీ అని తెలిపారు. అణగారిన బతుకుల్లో నింపి, ఆఖరి క్షణం వరకు దేశం కోసమే బతికిన ఆధునిక భారత నిర్మాత రాజీవ్ గాంధీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గోన్నారు.

# మాజీ ప్రధాని స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు

## ■ కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలను హనుమంత్ రెడ్డి నివాళులు

**కుత్బుల్లాపూర్ - ఆగష్టు 20:(నవభూమి ప్రతినిధి)** నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో మాజీ ప్రధాని స్వర్గీయ కి. శే రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పుల మల వేసి ఘణ నివాళుల్పించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అంనతరం హన్మంతన్న మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్ గాంధీనే అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. దేశంలో బీదరికాన్ని పారద్రోలి సమసమాజ స్థాపనకు ఆయనచేసినకృషిఎప్పటికిమరవలేమని కొనియాడారు.



ఈ కార్యక్రమంలో నిజాంపేట్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, బహదూర్ పల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, ఎన్ టియుసినాయకులు నర్సింగ్ రావు, మల్లికార్జున్ ,శామీర్పేట్ ప్రకాష్ , ఎండి ఉస్మాన్, షఫీ, దుద్దు రాహుల్, శైలజ, చంద్ర కల తదితరులు పాల్గొన్నారు.

# చర్చి గాగ్లిల్లాపూర్ 214లో నిలిచిన వరదనీరు







**కుత్బుల్లాపూర్ ఆగష్టు 20:(నవభూమి ప్రతినిధి)** దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి పిర్యాదుకు గాగిల్లాపూర్ నిన్నటి వరకు మంచి నీరు నేడు వర్షపు నీరు 214 స్లం అంటే పట్టింపు లేని అధికారులు మాటకు స్పందించిన మున్సిపల్ విద్యుత్ అధికారులు సమస్యకు పరిష్కారంగాగిల్లాపూర్ 214 లో నెలకొన్న నిన్నటి వరకు తాగడానికి మంచి నీళ్లు లేవు ఈరోజు చిన్న వర్షానికే ఇండ్ల ముందు చెరువును తలపించే వర్షపు నీరు నిలువ ఇండ్లలోకి పోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఇండ్లకు విద్యుత్ కోత వల్ల తీవ్ర షర్ట్ సరక్యూట్ అయ్యి ప్రాణ భయంతో బయట పడుకున్న వాసులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్న కాలనీ వాసులు స్థానిక బీజేపీ నాయకులు ఎన్ రోజా అభ్యర్ధన మేరకు మున్సిపల్ అధ్యక్షులు కృష్ణారెడ్డి మీడియా ద్వారా సమాచారం కమీషనర్ కు ఇచ్చి ఈరోజు సమస్య మున్సిపల్ అధికారులు,జేసీబీ సహాయంతో మరియు విద్యుత్ అధికారుల తో మాట్లాడి దగ్గరుండి సమస్య పరిష్కారం చూపడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తురాయి భానుగౌడ్,ఉపాధ్యక్షురాలు రోజా గాగిల్లాపూర్ చిన్న కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# భారత ఎన్నికల కమిషన్ జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల కోసం ప్రత్యేక సమ్మరీ రివిజన్‌కు షెడ్యూల్ విడుదల

## ■ హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 20:** భారత ఎన్నికల కమిషన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గ ఉప ఎన్నికల కోసం స్పెషల్ సమ్మరీ రివిజన్ కు షెడ్యూల్ విడుదల చేసినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ తెలిపారు.. బుధవారం జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల కమిషన్ సూచించిన స్పెషల్ సమ్మరీ రివిజన్ ను ఎన్నికల అధికారి వివరించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమం సెప్టెంబర్ 2 నుండి సెప్టెంబర్ 17 వరకు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు తప్పని సరిగా ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 2 నుండి 17 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్ 25 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ డిస్పోజల్ చేస్తామన్నారు. సెప్టెంబర్ 30 వరకు ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్ చేస్తామని కమిషనర్ వారికి వివరించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ లో రాజకీయ ప్రతినిధులు సహకరించి ఈ ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు సందేహాలను నివృత్తి చేయడమే కాకుండా సూచనలు స్వీకరించి సమగ్ర ఓటరు జాబితా తయారీ చేస్తామన్నారు. అందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. బీజేపీ ప్రతినిధులు మర్రి శశిధర్ రెడ్డి, కొల్లూరి ప్రవీణ్ కుమార్, పి.వెంకటరమణ, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి కె.సందేశ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మల్లంగి విజయ్, సిపిఎం ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు రాజేష్ కుమార్, మహ్మమద్ వాజిద్ హుస్సేన్, తెలుగు దేశం పార్టీ ప్రతినిధి ప్రశాంత్ రాజు యాదవ్, ఎం.ఐ.ఎం నుండి సయ్యద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

**అశ్వారావుపేట టౌన్ ఆగస్టు 20 నవభూమి:** ప్రతి సంవత్సరం ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా వైద్యాధికారి ఆధ్వర్యంలో అశ్వారావుపేట రూరల్ వైద్య సిబ్బంది అశ్వారావుపేట లోని మహాత్మా జ్యోతి రావు పూలే బాలికల పాఠశాలలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఒకవేళ నీరు బయటకు పోనట్లయితే ఆయిల్ బాల్స్ తయారు చేసి, నిల్వ నీటిలో వేయాలని సూచించారు. మొదట ఈ దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోదకాలు వంటి వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు.



# ఓటు హక్కు విషయంలో ఎన్నికల కమిషన్ రాజ్యాంగ సంస్థగా పనిచేయడం లేదు

- సిపిఐ ప్రధాన కార్యదర్శి బి రాజ్ ఆరోపణ
- బిజెపి మోదీలను గద్దె దింపేందుకు ప్రజాతంత్ర లౌకిక శక్తులు ఏకం కావాలి
- ఉపరాష్ట్రపతి గా జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి గెలిస్తే దేశ భవిష్యత్తులో తీవ్ర ప్రభావం
- గాజులరామరం మహారాజ్ గార్డ్‌లో సిపిఐ4 మహాసభలను ప్రారంభించిన సిపిఐ ప్రధాన కార్యదర్శి డిజే రాజ్













**కుత్బుల్లాపూర్ – ఆగష్టు 20: (నవభూమి ప్రతినిధి)–** ఓటు హక్కు ఎన్నికల కమిషన్ రాజ్యాంగ సంస్థగా పనిచేయడంలేదనీబిజెపి, మోదీలను గద్దె దింపేందుకు ప్రజాతంత్ర లౌకిక.శక్తులు ఏకం కావాలి ఇండియా కూటమిలో పరస్పర సహకారం, సర్దుబాటు ఉండాలి ఉప రాష్ట్రపతిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి గెలిస్తే దేశ భవిష్యత్రాజకీయాలలో తీవ్ర ప్రభావంసిపిఐ రాష్ట్ర 4వ మహాసభను ప్రారంభిస్తూ సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజుల రామారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన మహాసభలు పొట్లూరి నాగేశ్వర రావు నగర్, హైదరాబాద్ రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అయిన ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా చూడడంలో భారత ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థగా లేదా తటస్థ సంస్థగా పని చేయడం లేదని మండిపడ్డారు. అందుకే బిహార్ హక్కు కోసం పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభమైందన్నారు. రాజ్యాంగం,ప్రతిఒక్కరిఓటుహక్కుపరిరక్షించబడాలంటే బిజెపిని, ప్రధాని మోదీని అధికారం నుంచి దించి వేయాల్సిందేనన్నారు. అందుకు లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ ఒకే వేదికపైకి వచ్చి బిజెపిని, మోదీని గద్దె దించేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజ్ జిల్లాలోని 'కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వరరావునగర్'గాజులరామారంలోని 'కామ్రేడ్ ఎన్.బాలమల్లేశ్ హాల్' మహారాజా గార్డెన్స్ లో మూడు రోజుల పాటు జరిగే సిపిఐ రాష్ట్ర 4వ మహాసభను బుధవారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. ప్రారంభ సభకు సిపిఐ శ్రేణులు ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు ధరించి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రాంగణంతా అరుణవర్ణం సంతరించుకుంది. మహాసభ ప్రారంభోత్సవ సభలో ముఖ్యఅతిథిగా రాజా, అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాల్గొన్నారు. సభలో సిపిఐఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సౌహార్ధసందేశాలిచ్చారు. మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎం ఎల్ ఎ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాస రావు, సిపిఐ ఎంఎల్ నెల్లికంటి సత్యం, మాజీ ఎంఎల్ పి.జె.చంద్రశేఖరరావు, సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, కవి, రచయిత ఏటుకూరి ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, కళవేన శంకర్, ఎం.బాల నరసింహా, వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహా, ప్రముఖ సినీ నటుడు డాక్టర్ మాదాల రవి, ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డి.జి.సాయిల్ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి ఇ.ఉమా మహేశ్ తదితరులు ఆసీనులయ్యారు. సభలో డి.రాజా ప్రసంగిస్తూ దేశం ప్రస్తుతం అత్యంత సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోందని, ప్రాథమిక హక్కులు, పౌరుల హక్కుగా ఉన్న ఓటు హక్కు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. బిజెపి, ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం రాజ్యాంగంపై దాడి పెరిగిందన్నారు. పార్లమెంట్ పనిచేయనివ్వడంలేదని, అది పని చేయకపోతే ప్రజాస్వామ్యం అంతమవుతుందని, ప్రజాస్వామ్యం విధ్వంసంఅవుతుందనిహెచ్చరించారు.

అర్హులైన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషన్ ఉండగా, బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ పేరుతో పాలకులకు ఇష్టం లేని ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించే కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. త్వరలో ఎన్నికలు జరిగే తమిళనాడు, కేరళ, బెంగాల్ రాష్ట్రాలలో ఎన్నికల కమిషన్ ఎలా పనిచేస్తుందనేది పెద్ద సమస్య అన్నారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కును కల్పించేందుకు రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల కమిషన్ అధికారాలు ఉన్నాయని, కానీ ప్రస్తుతం ఆ సంస్థ రాజ్యాంగ బద్ధమైన సంస్థగా పనిచేయడం లేదని విమర్శించారు. ఎన్నికల కమిషన్ అర్హులైన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నదని, అర్హులైన వారు తమ ఓటు హక్కును కోల్పోతున్నారని, ప్రజాస్వామ్యం ఎక్కడ అమలు జరుగుతున్నదని నిలదీశారు. బిహార్ ఎస్ నిలుపుదల చేయాలని సుప్రీం కోర్టులో సిపిఐ తరపున స్వయంగా తాను పిటిషన్ దాఖలు చేసినట్టు రాజా వెల్లడించారు. భారత్ హిందూత్వ దేశం, మతతత్వ రాజ్యాంగా మారితే దేశానికే పెద్ద విపత్తుగా పరిణమిల్లుతుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఏనాడో హెచ్చరించారు. భారతదేశాన్ని కాపాడాలంటే బిజెపికి వ్యతిరేకంగా, ఆర్ వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అందుకే ఇండియా కూటమి ఏర్పాటైందని, దాని ఏర్పాటులో సిపిఐ కీలక పాత్ర పోషించిందని రాజా తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వాములు కూడా పరస్పర సహకారం, సర్దుబాటు అవసరమని సూచించారు.ఓటు హక్కును 18 ఏళ్ళక సవరించిన ఘనత సిపిఐదేఇటీవలనే దేశ స్వాతంత్ర్య దినోత్సవం జరిగిందని, స్వాతంత్ర్యం రాకముందుభారతదేశం బ్రిటీష్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వలస పాలనలో ఉండేదని, అప్పట్లో ఎన్నికలు జరిగాయని, కానీ ఓటు హక్కు అందరికీ ఉండేది కాదని, సంపన్నులు, ఉన్నతస్థాయి వ్యక్తులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే భారతదేశంలో 21 ఏళ్లు దాటినపౌరులందరికీ మతాలు, ప్రాంతాలు,స్త్రీ,పురుష బేధం లేకుండా వయోజన ఓటు హక్కును రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కల్పించారని తెలిపారు. , సిపిఐ నేత సి.కె.చంద్రప్పన్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో వయోజన ఓటు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించాలని పార్లమెంట్ ప్రస్తావించగా, నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అంగీకరించడంతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కులం, మతం, ప్రాంతం అనే తేడాలు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించు కుంటున్నారన్నారు. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే వయోజనులైన పురుషులతో సమానంగా మహిళలకు కూడా ఒకే సమయంలో ఓటుహక్కు లభించిందన్నారు. కానీ అమెరికాలో , యురోపియన్ దేశాల్లో చాలా కాలం పురుషులకు మాత్రమే ఓటు హక్కు ఉండేదని, అనేక పోరాటాలు తరువాతనే మహిళలకు ఓటు హక్కు దక్కిందన్నారు. భారతదేశంలో అత్యంత ధనికులైన అదానీ, అంబానీ ఓటుకు, సామాన్య ప్రజల ఓటుకు ఒకే విలువ ఉంటుందని, అది అంబేద్కర్ గొప్పతనమని చెప్పారు. అదే విధంగా ఓటుతో పాటు ప్రతి మనిషికి ఒకే విలువ ఉండే సమాజం కావాలని ఆయన ఆకాంక్షించారని గుర్తు చేశారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక రాజకీయ యుద్ధంఉప రాష్ట్రపతి ఎన్నికలు దేశ చరిత్రలో ఎంతో కీలకమని, ఈ ఎన్నిక రాజకీయ యుద్ధం అని రాజా అన్నారు. దేశ ఉప రాష్ట్రపతి ధన్ ఎందుకు రాజీనామా చేశారని ఆయన ప్రశ్నించారు. ధన్ రాజీనామాకు ఆయన అనారోగ్యం కారణం కాదని, రాజకీయ కారణం ఉన్నదని, అదేమిటో ఇప్పటికీ ఎవరికీ తెలియదన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ప్రకటించారని, సిపిఐ కూడా మద్దతు ప్రకటించిందని, లౌకిక పార్టీలు అన్నీ జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఉప రాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపొందితే దేశ భవిష్యత్ రాజకీయాలలో తీవ్ర ప్రభావం చూపుతుందని, చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని రాజా తెలిపారు. ఎన్నికల్లో సిపిఐ బలం పెరగాలికార్మికులు, రైతులు, మహిళలు, కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయాలని రాజా పిలుపునిచ్చారు. తెలంగాణలో సిపిఐ అత్యంత బలమైన పార్టీ అని, ప్రస్తుతం ఒక్క ఎంఎల్ ఎంఎల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు.ప్రజాసమస్యలను మరింత ఎలుగెత్తి చాటేందుకు పార్లమెంటు, అసెంబ్లీ, ప్రతి ప్రజాప్రాతినిధ్య ఎన్నికల్లో సిపిఐ బలం పెరగాలని ఉద్ఘాటించారు.నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన ఘన చరిత్ర సిపిఐది అని గుర్తు చేశారు. వీర తెలంగాణ గడ్డపై మతోన్మాద బిజెపిని అడ్డుకునే శక్తి వామపక్షాలకే ఉంది : కందిమళ్ల ప్రతాపరెడ్డి వీర తెలంగాణ గడ్డపై మతోన్మాద బిజెపి అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి కేవలం వామపక్ష పార్టీలకే ఉందని, ఇందుకు అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని సిపిఐ సీనియర్ నాయకులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ వందేళ్ల ప్రస్థానంలో చేసిన పోరాటాలు, త్యాగాలు సాధించిన విజయాలను మననం చేసుకుంటున్నామన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సిపిఐ పోరాటాలు నిర్వహించిందని, మాతృదేశం కోసం నాయకులు ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. 1942 వరకు భారత కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్నా, రైతులు, కూలీలు, విద్యార్థులు, యువకులను సంఘటితం చేసి స్వాతంత్ర్య పోరాటంలో కదిలించిందని వివరించారు. స్వాతంత్ర్య సమరంలో ముందుండి పోరాటం చేసిన కమ్యూనిస్టు పార్టీ నాయకులు జైలు శిక్ష అనుభవించారన్నారు. నిరంకుశ నిజాంకు వ్యతిరేకంగా మట్టి మనుషులతో బంధూకులు పట్టించి సాయుధ సమరాన్ని నడిపిన చరిత్ర సిపిఐదన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలికతో కొంత బలహీనమైందని, దీనిని అధిగమించేందుకు దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు, మేధావులను ఏకం చేసేందుకు కీలకపాత్ర పోయించాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను ఆయన కోరారు. రాజకీయాలు వ్యాపారంగా మారాయని, తెలంగాణ విప్లవగడ్డపై కమ్యూనిస్టులుగా కమ్యూనిస్టుల పాత్ర ఏమిటనేది మహాసభలో ఆత్మపరిశోధన చేసుకోవాలని సూచించారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను మరుగున పడేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే స్ఫూర్తి అని, అయితే మాజీ సిఎం కెసిఆర్ తానే ఒక వీరునిగా చెప్పుకుంటున్నారని, సాయుధ పోరాటాన్ని తామే నడిపించినట్టు చరిత్రను బిజెపి వక్రీకరిస్తున్నారన్నారు. కమ్యూనిస్టులందరి ఆశయం ఒక్కటేనని, ఐక్యత తమ ఆయుధమని, ఈ ప్రజాతంత్ర ఐక్యత ద్వారా కమ్యూనిస్టు స్ఫూర్తిని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అమర వీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిందే ఎర్ర జెండా ఏటుకూరి ప్రసాద్అమర రవీరుల త్యాగం, రక్తంతో ఎరుపెక్కిన జెండా ఎర్రజెండా అని, నిజాంకు వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటంలో ఎందరో అమరులైన వారి వారసత్వం బాట ఎర్రబాట అని ఏటుకూరి ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నాటి దశలో ఉన్న రాజకీయ పరిస్థితులే ప్రస్తుతం దేశంలో ఉండడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఫాసిజం మళ్లీ విజృంభిస్తుందన్నారు. గతంలో కమ్యూనిస్టులు రక్తార్పణతో ఏ అశయాలు, అదర్శాలతో ముందుకు వెళ్లారో ఆ ఆశయాల స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ఫాసిజం ఎన్నో రకాల ముసుగు ధరించి చిన్నల నుంచి పెద్దల వరకు అనేక రూపాల్లో బయటపడడం ప్రజాస్వామ్యానికి.తీవ్రవిఘాతమన్నారు. ఈ పరిస్థితులు ఎదుర్కొనే శక్తి కేవలం వామపక్షాలకు మాత్రమే ఉందన్నారు. ఈ దశలో అమరవీరుల ఆశయాలల స్ఫూర్తితో వామపక్షాలన్నీ ఐక్యంగా ముందుకు కదిలి ఫాసిస్టు శక్తులను ఓడించేందుకు ప్రతిజ్ఞ చేయాల్సి అవసరముందన్నారు. సినీ నటులు మాదాల రవి మాట్లాడుతూ కమ్యూనిస్టు శక్తులన్నీ ఏకమై పోరాటం చేసినప్పుడే సామాన్యుడి గుండె ప్రతిధ్వనిస్తుందని, కుళ్లుతున్న వ్యవస్థను కూకటి వేళ్లతో పీకేస్తారని అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో సాంస్కృతిక విప్లవం రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. మతతత్వ శక్తులను ఎదుర్కొవాలంటే డబ్బులు ప్రధానంగా మారిన ఎన్నికల వ్యవస్థపై అందరూ కలిసి పోరాటం చేయాలన్నారు. కళ కాసుల కోసం కాదని, సామాన్యులలో చైతన్యం తీసుకురావడం కోసమని, ప్రజా కళాకారులందరూ ప్రజలను చైతన్య వంతులను చేసినప్పుడే ప్రజలలో చైతన్యం వస్తుందన్నారు. మానవ సంబంధాలను మట్టి కరిపించే విధంగా ప్రస్తుత సినిమాలు, సీరియల్స్ ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎర్రమల్లెలు లాంటి సినిమాలు తీసిన మాదాల రంగారావు కూడా కమ్యూనిస్టు పార్టీ తయారు చేసిన ఆయుధం అన్నారు.

# సిఎంఆర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఒరియన్టేషన్ డే







**మేడ్చల్- ఆగష్టు 20:(నవభూమి ప్రతినిధి)** నియోజకవర్గం కండ్లకోయ పరిధి లోని సిఎం ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ అడిటోరియంలో జరిగిన సిఎం ఆర్ ఇన్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఒరియన్టేషన్ డే 2025 కార్యక్రమంలో పాల్గోని నూతనంగా అడ్మిషన్స్ తీసుకున్న విద్యార్థిని విద్యార్ధులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది. కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ అఫ్ ఎక్సలెన్స్ ఇన్ డ్రోన్ టెక్నాలజీ బ్లాక్ ను ప్రారంభించడం జరిగింది

# మైసమ్మ గూడెం కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టేక్నాలజీ ఆడిటోరియంలో ఓరియంట్ డే



**మేడ్చల్- ఆగష్టు 20:(నవభూమి ప్రతినిధి)** నియోజకవర్గంగుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మ గూడ లోని మల్లారెడ్డి కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆడిటోరియంలో జరిగిన ఒరియన్టేషన్ డే 2025 కార్యక్రమంలో పాల్గొని నూతనంగా అడ్మిషన్స్ తీసుకున్న విద్యార్థిని విద్యార్ధులకు దిశా నిర్దేశం చేయడం జరిగింది.

# గార్లలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**గార్ల, నవభూమి, ఆగస్టు 20:** దివంగత భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వేర్వేరు గా బుధవారం గార్ల లో ఘనంగా నిర్వహించారు. ఒక వర్గం సీతంపేట రోడ్డులో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద, మరో వర్గం స్థానిక నెహ్రూ సెంటర్ లో రాజీవ్ గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ దేశానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను మననం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్, శంషాద్ బేగం, భూక్యా అశోక్, ఎడ్ల అప్పయ్య, గుగులోతు శ్రీను, రమేష్, హాతిరాం, షేక్ యాకుబ్ పాష, సుందర్, బాబు లాల్, తదితరులు పాల్గొన్నారు.

# కంఠం మహేశ్వర స్వామి ఎల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ

## ■ పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి





**కుత్బుల్లాపూర్- ఆగష్టు 20:(నవభూమి ప్రతినిధి)-** నియోజకవర్గం, మూడు బిచింతలపల్లి మున్సిపాలిటీకి చెందిన గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వర స్వామి, ఎల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ముఖ్య అతిథిగా కాంటెస్టడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ ఎంపీపీ ఏనుగుబిసుదర్శన్‌బిరెడ్డి , విచ్చేసి అమ్మవారి దర్శనం చెసుకోని గ్రామ ప్రజలందరికి ఎల్లమ్మ తల్లి దివెనలు ఉండాలని కోరుతు, కంఠమహేశ్వర గుడి నిర్మాణానికి తోడ్పడిన గౌడ సంఘం పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు, ఈ దైవ కార్యనికి నన్ను ఆహ్వానించిన స్థానిక బిజెపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు..ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తప్పెట్ల నరేందర్‌బిగౌడ్ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు సుధాకర్ నాయక్ పరమేష్ గౌడ్ జగన్మోహన్ రెడ్డి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# నరసింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ఒరియెంటేషన్ డే





**మేడ్చల్,- ఆగస్టు 20:( నవభూమి ప్రతినిధి )** గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధి, మైసమ్మగూడ లోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నేడు ఘనంగా ఒరియెంటేషన్ డే ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాళోజీ పురస్కార గ్రహీత డా. సి.నారాయణ స్వామి, గౌరవ అతిథిగా స్ఫూర్తిదాయక వక్త డి జి రామ మూర్తి ప్రత్యేక అతిథులుగా ప్రముఖ సైకాలజిస్ట్ డా. అన్నంరెడ్డి చాముండేశ్వరి, టాటా గ్రూప్స్ సీనియర్ మేనేజర్ నీరజ సింగ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.లోకనాథం మాట్లాడుతూ తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. శక్తివంచన లేకుండా తమ వంతు సహకారం ఎల్లప్పుడూ విద్యార్థులకు అందచేస్తామని తెలిపారు, డైరెక్టర్ డా. మోహన్ బాబు మాట్లాడుతూ తమ కళాశాల పై నమ్మకంతో తల్లిదండ్రులు తమ కళాశాలను ఎంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు, ఈ నాలుగు సంవత్సరాలు కష్టపడి చదివితే తర్వాత 40 సంవత్సరాలపాటు హాయ్ గా తమ జీవనాన్ని కొనసాగించచ్చని తెలిపారు. కళాశాల కార్యదర్శి త్రిశూల్ మాట్లాడుతూ కళాశాలలో తగిన సౌకర్యాలు ఉన్నాయని వాటిని మెరుగ్గా ఉపయోగించుకొని తమ ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు అందరూ తప్పక క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. విద్యార్థులకు అన్నింటా వెన్నుదన్నుగా ఉంటామని, విద్యార్థులు కూడా అందుకు తగ్గ కృషి చేయాలని తెలిపారు. కాళోజీ పురస్కార గ్రహీత డా. సి. నారాయణ స్వామి మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ జ్ఞానాన్ని పెంచుకోవాలని, జ్ఞానమే తరగని సంపద అని, కృషితో నాస్తి దుర్భిక్షం అనే నానుడి ని అనుసరించి విద్యార్థులు ఎల్లప్పుడూ కష్టపడుతూ తమ పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ, ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ జె నర్సింహారెడ్డి, కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి , ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకనాథం, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తండ్రి జ్ఞాపకార్ధం ఉచిత వైకుంఠ రథం

## ■ దప్పు సాయిబాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైకుంఠ రథం ప్రారంభం



**శామీర్‌పేట, ఆగస్టు 20 (నవభూమి ప్రతినిధి) :** తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో శామీర్‌పేట వార్డు కార్యాలయం వద్ద మాజీ ఎంపీటీసీ దప్పు సాయి బాబు తన తండ్రి జ్ఞాపకర్ధంగా ఉచిత వైకుంఠ రథం వాహనాని ప్రారంభించారు. బుధవారం దప్పు సాయి బాబు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఉచిత వైకుంఠ రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత సేవ భావంతో ముందుకు వచ్చి తమ సేవలను ప్రజల అందించాలన్నారు. ప్రజలకు సేవ చేసే భావంతో దప్పు బిక్షపతి జ్ఞాపకార్థం దప్పు సాయిబాబు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, శామీర్‌పేట సిఐ శ్రీనాథ్ కు శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ మెంబర్ మహమ్మద్ ముజీబుద్దిన్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రిజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్‌పేట మాజీ సర్పంచ్ కిషోర్ యాదవ్, అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచ్ కంఠం కృష్ణారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు శ్రీఖర్ రెడ్డి, నాయకులు గాదె వెంకటేష్, వంగ నరసింహా రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం..ఇద్దరు పిల్లలు మృతి







**కుత్బుల్లాపూర్ - ఆగష్టు 20:(నవభూమి ప్రతినిధి)** కామారెడ్డి నుండి బ్రతుకుతెరువు కోసం ప్రగతి నగర్‌కు వచ్చిన లక్ష్మణ్ ఇటుక బట్టీల్లో రోజువారీ కూలి.అతని భార్యరత్నమ్మ వారికి 4 నలుగురు సంతానం, ఇక్కడ ఇద్దరు పిల్లలు సొంతూరులో తాత దగ్గరఇద్దరుపిల్లలునివసిస్తున్నారు... ఈ నేపథ్యంలో ఫ్యామిలీ ప్లానింగ్ విషయమై నిన్న భార్య భర్త మధ్య గొడవలై మనస్తాప తో తల్లి రత్నమ్మ అలియాస్ లక్ష్మి (30) ఇద్దరు బాబుల తోఅరుణ్ (3) అబ్బాయిసుభాష్ (8) అబ్బాయి ఆత్మహత్యాయత్నం చేసింది.

**ఇంట్లో ఉన్న నీటి సంపులో ఇద్దరు బాబులతో పాటు దూకిన తల్లి.**

నీరు తక్కువ ఉండటం కారణంగా బ్రతికిన తల్లి మరణించిన ఇద్దరు బాబులు లక్ష్మికి చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించిన బాచుపల్లి పోలీసులు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీకి తరలించిన పోలీసులు, ప్రాథమిక దర్యాప్తులో కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె ఈ ఘటనకు పాల్ప డినట్లు తెలుస్తుంది.నిన్న రాత్రి 100 డయల్ ద్వారా సమాచారం అందుకొని సంఘటన స్థలం చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న మహిళను రక్షించి ఆసుపత్రికి తరలించామని అప్పటికే ఇద్దరుపిల్లలు మృతిచెందారని,కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఘటన జరిగిందని బాచుపల్లి సి.ఐ తెలిపారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్న బాచుపల్లి పోలీసులు

## అశ్వారావుపేట క్యాంపు కార్యాలయంలో ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**అశ్వారావుపేట టౌన్ ఆగష్టు 20 నవభూమి:** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారతదేశ మాజీ ప్రధానమంత్రి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత దివంగత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన అశ్వారావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మ రాంబాబు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మ రాంబాబు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశ యువ ప్రధానమంత్రిగా ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేశారన్నారు. సమాచారం సాంకేతిక రంగంలో నూతన మార్పులు తీసుకువచ్చి విద్యార్థులు యువతకు కొత్త అవకాశాలు అందించారన్నారు. ఆయన కలలే నేటి డిజిటల్ భారతానికి బలమైన పునాదిగా మారాయన్నారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధికి పేదల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుంకవల్లి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



# వినాయక చతుర్థికి అధికారులు అన్ని ఏర్పాటు చేయాలి

## ■ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ శాఖ వినతి



**కుత్బుల్లాపూర్ - ఆగష్టు 20:(నవభూమి ప్రతినిధి)** అసెంబ్లీ పరిధి వినాయక చతుర్థి కి జిహెచ్ఎంసి దుండిగల్ కొంపల్లి నిజాంపేట్ మున్సిపాలిటీలలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని అదేవిధంగా పోలీస్ అధికారులు మండపాల ఏర్పాట్లు విషయంలో ఇబ్బంది పెట్టరాదని వినాయక నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అదేవిధంగా డివిజన్లో వారిగా గత సంవత్సరం వినాయక చవితికి ఏర్పాట్లు విషయం జరిగిన ఇబ్బందులపై చర్చించి అదేవిధంగా హిందూలందర్నీ సంఘటితం చేయడమే కాకుండా అన్ని మండపాలతో సమన్వయం చేసుకునే విధంగా కార్యాచరణ కోసం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ గిరి వర్ధన్ రెడ్డి కోకన్వీనర్ ఆకుల సతీష్ కట్ట కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశం నందు పలు విషయాలపై చర్చించడమే కాకుండా వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవడానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ కన్వీనర్ బలరాం మరియు సూరారం కన్వీనర్ శ్రీనాథ్ రమేష్ చింతల్ డివిజన్ కన్వీనర్ సూర్య భానుచందర్ మరియు కుత్బుల్లాపూర్ కోకన్వీనర్ రామ్ సుభాష్ నగర్ డివిజన్ కన్వీనర్ విగ్నేష్, రంగారెడ్డి నగర్ డివిజన్ కన్వీనర్ వేణు జగదిగిరిగుట్ట కన్వీనర్ రాజు , రమేష్ యాదవ్ కుత్బుల్లాపూర్ పవన్ నిజాంపేట్ కన్వీనర్ చక్రధర్ అరుణ్ రావు సుబ్బారావు కొంపల్లి మున్సిపాలిటీ కన్వీనర్ శివాజీ సతీష్ సాగర్ మాధవి దుండిగల్ మున్సిపల్ కన్వీనర్ ఆంజనేయులు మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల నియామకాలు బదిలీలు ,ప్రమోషన్‌లలో రూల్ అప్

# రిజర్వేషన్ అమలుపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

## ■ జెన్ కో సంస్థ సమీక్షలో సమావేశంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమీషన్ చైర్మన్‌బక్కి వెంకటయ్య





**కంటోన్మెంట్, నవభూమి ప్రతినిధి, ఆగష్టు 20:** తెలంగాణ పవర్ జనరేషన్ కార్పోరేషన్ లో ఉద్యోగుల నియామకాలు,బదిలి,ప్రమోషన్ లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ల అమలు లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం నాడు హైద్రాబాద్ లోని తెలంగాణ పవర్ జనరేషన్ కార్పోరేషన్ కార్యాలయంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ లను ఉల్లంఘించవద్దన్నారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎస్సీ ఎస్టీల ఉద్యోగుల విధి నిర్వహణకు సంబంధించిన ఏ ఉద్యోగికైనా వివక్షతకు గురైతే నేరుగా ఎస్సీ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రూల్ అప్ రిజర్వేషన్ అమలుకు సంబంధించి ఉద్యోగులు తమ సమస్యలను కమిషన్ చైర్మన్,కమీషన్ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని క్యాడర్లలో పదోన్నతులు తమకు అన్యాయం జరుగుతుందని కొంతమంది ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.తమ సమస్యలను కమిషన్ చైర్మన్ కు వినతి పత్రాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి , రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, రాంబాబు నాయక్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. హరీష్ ఐఏఎస్ , ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్‌లో మంచినీటి బోరు



**మేడ్చల్ - ఆగష్టు 20:(నవభూమి ప్రతినిధి)** ఘట్కేసర్ మున్సిపల్ ఇడ్లయుఎస్ కాలనీ లోని కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఇడ్లయుఎస్ కాలనీ అభివృద్ధి సంఘం అభ్యర్థన మేరకు మున్సిపల్ నిధులతో ఈరోజు బోర్ ని వేయడం జరిగింది. మున్సిపల్ కమిషనర్ కి,మాజీ చైర్మన్ అధికారులకు ఇడ్లఎస్ కాలనీ తరుపున వారికి ప్రత్యేకధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ , కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాల్ యాదవ్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్ మాజీ కౌన్సిలర్ బర్ల శశికళ దేవేందర్ ముదిరాజ్ ఇండ్ల ఎస్ కాలనీ అధ్యక్షులు కేశవ పట్నం ఆంజనేయులు , సెక్రటరీ శశి ధరన్ , కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు రామ్ మోహన్, దంతూరి గోపాల్ గౌడ్, శివరాత్రి సురేష్, అశోక్ ముదిరాజ్, రమేష్,దంతూరి సుధాకర్గౌడ్,శ్రీనివాస్, వర్క్ ఇన్స్ పెక్టర్ రాకేష్,వాటర్ మ్యాన్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# రాహూల్‌ను ప్రధాని చేయటమే రాజీవ్‌కు ఘన నివాళి

## ■ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల నరసింహారావు

**జూలూరుపాడు, ఆగస్ట్ 20 (నవభూమి ప్రతినిధి)** భారత దేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘన నివాళి నివాళులర్పించారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి పై ఆయన విగ్రహానికి వెంగన్నపాలెం మాజీ ఎంపీటీసీ దుద్దుకూరు మధుసూదన్ రావు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల నరసింహారావు మాట్లాడుతూ భారత దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా నిలిపి సమాచార రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన ఖ్యాతి రాజీవ్ కే దక్కిందన్నారు. తన తల్లి ఇందిరా గాంధీ హత్యానంతరం క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాన మంత్రి గా బాధ్యతలు చేపట్టి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తు చేసుకున్నారు.దేశం కోసం తీవ్ర వాదుల చేతిలో తాను బలిదానం అర్పించారని ఆవేదన వ్యక్తంచేశారు.దేశం కోసం భర్తను కోల్పోయిన సోనియా గాంధీ ఆ తర్వాత పార్టీ పగ్గాలు చేబూని పదేండ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తెచ్చి ఆర్థికవేత్త స్వర్గీయ మన్మోహన్ సింగ్ ను ప్రధాన మంత్రిని చేసి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేవిధంగా కృషి చేశారని, చివరకు సోనియా గాంధీ దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని తెలిపారు.